ప్రేమజంట నిర్బంధం? | చెన్నై వద్ద గోడౌన్‌లో ఉన్నట్టు సమాచారం | రూ.15 లక్షలు ఇవ్వకపోతే చంపేస్తామంటూ బెదిరింపులు | లోపలి పేజీలో



నేటి నుంచి రీసర్వే

- 38 గ్రామాల్లో మొదలు ● మండలానికొకటి ఎంపిక
- జిల్లాలో 64,906 ఎకరాలు పరిశీలన
- ప్రభుత్వ, దేవదాయ భూములతోపాటు ప్రైవేటువి కూడా..

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూముల రక్షణకు శ్రీకారం చుట్టింది. వైసీపీ పాలనలో ప్రభుత్వ, దేవదాయ భూములతో పాటు ప్రైవేటు భూములను ఇష్టారాజ్యంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, ఒకరి భూమిని మరొకరికి ఇవ్వడం వంటివి జరిగాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయా భూములపై అనేక ఫిర్యాదులు రావడంతో చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించింది. అందుకోసం గ్రామాల్లో రీ సర్వే చేయాలని నిర్ణయించింది. తదనుగుణంగా సోమవారం నుంచి జిల్లాలో రీ సర్వే జరగనుంది. మొత్తం 38 మండలాలు ఉండగా ఒక్కొక్క మండలంలో ఒక్కొక్క గ్రామాన్ని ఎంపిక చేసింది. ఆయా గ్రామాల్లో రీ సర్వే చేసేందుకు అవసరమైన ప్రణాళికలను అధికారులు రూపొందించారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ నేతృత్వంలో ఇప్పటికే మండల, గ్రామ సర్వేయర్లకు రీ సర్వే చేసే విధి విధానాలపై శిక్షణ కూడా ఇచ్చారు. జిల్లాలోని 38 గ్రామాలను 136 బ్లాకులుగా విభజించారు. ఫీల్డ్‌వర్క్ బృందాలను 126 ఏర్పాటు చేశారు. కమ్యూనికేషన్ టీమ్స్‌ను 38 బృందాలుగా నియమించారు. ఒక్కొక్క సర్వే బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక గ్రామ రెవెన్యూ అధికారి, మరొకరు గ్రామ రెవెన్యూ సహాయకులు ఉంటారు. ఈ బృందాలు జిల్లా వ్యాప్తంగా 64,906.04 ఎకరాల భూములను రీ సర్వే చేయనున్నారు.

రీ సర్వే ఇలా..

రీ సర్వే జరిగే గ్రామాల్లో ముందుగానే రైతులతో అవగాహన సదస్సులతో పాటు భూముల యజమానులందరికీ నోటీసులు ఇస్తారు. గ్రామంలో అందుబాటులో లేకపోయినా ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న వారికి కూడా వాట్సప్‌ల ద్వారా సమాచారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. ఇంకోవైపు ప్రభుత్వ, దేవదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా గట్టి చర్యలు తీసుకొనేందుకు శ్రీకారం చుట్టింది. ఆ గ్రామంలో రీ సర్వే పూర్తయిన తర్వాత రికార్డులను పూర్తిస్థాయిలో భద్రపరచడంతో పాటు గ్రామసభలో పెట్టే విధంగా చర్యలు తీసుకున్నారు. సర్వే సమయంలో ఏమైనా ఇబ్బందులున్నా, చనిపోయిన వారి పేరు తొలగింపు వంటివి కూడా చేపట్టనున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

సోమవారం నుంచి రీ సర్వే ప్రారంభం కానున్న నేపథ్యంలో సర్వేయర్ల కొరత కూడా వేధిస్తోంది. ఇప్పటికే ఏడెనిమిది గ్రామాలకు సర్వేయర్లు లేకపోవడంతో ఇతర మండలాల సర్వేయర్లు ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. ఇంకోవైపు జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లు ఉండగా ఒక్కో డివిజన్‌లో ముగ్గురు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు(డీఐ) ఉండాలి. కానీ ఒంగోలు డివిజన్‌కు మాత్రం ముగ్గురు డీఐలు ఉండగా కనిగిరి డివిజన్‌కు ఒకరు మాత్రమే ఉన్నారు. మార్కాపురం డివిజన్‌కు ఇన్‌చార్జితో ఒకరు కొనసాగుతున్నారు. రీ సర్వే పూర్తిస్థాయిలో కొనసాగాలంటే సిబ్బంది కొరత లేకుండా చూడాల్సిన అవసరం ఉంది. మరోవైపు గ్రామాల్లో భూముల రీ సర్వే చేసే సమయంలో ఆధునిక సాంకేతిక పరికరాలను తీసుకెళ్లేందుకు అవసరమైన సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది. ప్రైవేటుగా మనుషులను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేయని పరిస్థితి ఏర్పడింది.

రెవెన్యూ అసోసియేషన్
నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రమాణస్వీకారం చేస్తున్న రెవెన్యూ అసోసియేషన్ నూతన కార్యవర్గసభ్యులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక రెవెన్యూ భవన్‌లో ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారిగా బాపట్ల జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.సురేష్‌బాబు, మహబూబ్‌బాషా, పెంచల్‌రెడ్డి వ్యవహరించారు. జిల్లా కార్యవర్గ ఎన్నికలకు ఒక్కో పదవికి ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో మొత్తం కార్యవర్గం ఏకగ్రీవమైంది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పిన్నిక మధుసూదన్‌రావు, కార్యదర్శిగా ఆర్.వాసుదేవరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా వి.కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఏవీ రవిశంకర్, జి.రజినికుమారి, ఎన్‌వీటీ రాజష్, కే కాశయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాము, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా ఎస్.రామనారాయణరెడ్డి, కోశాధికారిగా ఊతకోలు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా కె.కిషోర్‌కుమార్, కె.అశోక్, బీవీ సుబ్బారావు, శాంతి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లుగా జె.శ్రీనాథ్, ఎస్‌కే షాజహాన్, డి.వెంకటేశ్వరరావు, ఎం.గోపి, ప్రశాంత్‌నాయుడు, మాధవరావు, చైతన్య ప్రకాష్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో ఎన్నికల అధికారి సురేష్‌బాబు ప్రమాణస్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగులతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు అభినందించారు.



డీఎస్పీ విచారణ

నాగులుప్పలపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన అడపాల ఆదిశేషు, ఏకలవ్యకాలనీకి చెందిన పేరం రామచంద్రరావును కులం పేరుతో దూషించారని అందిన ఫిర్యాదు మేరకు అట్రాసిటి కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఒంగోలు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సురేష్‌బాబు ఆదివారం ఉప్పుగుండూరులో విచారణ చేపట్టారు.

కారు, ఆటో ఢీ

నాగులుప్పలపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కారు ఆటో ఢీకొన్న సంఘటన ఉప్పుగుండూరు వద్ద గల హైవేపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం గొనసపూడి నుంచి ఒంగోలు వెళుతున్న కారు ఉప్పుగుండూరు గ్రామంలో నుంచి హైవేకు వెళుతున్న క్రమంలో నిజాంపట్నంకు వెళుతున్న వాహనాన్ని ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. రెండు వాహనాలు దెబ్బతిన్నాయి.

24లోపు అభ్యంతరాలు తెలపాలి : జేసీ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూములు, ఇళ్ళ స్థలాల విలువల చేర్పులు, మార్పులు చేసేందుకు తయారు చేసిన ప్రతిపాదనలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 24వ తేదీలోపు తమ అభ్యంతరాలను తెలపాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తాత్కాలిక ఆమోదం పొందిన ప్రతిపాదనలపై ప్రజలు వెబ్‌సైట్‌లో కానీ, సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, కలెక్టర్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన నోటీసు బోర్డులలో అభ్యంతరాలు కోసం ఉంచినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ మార్కెట్ విలువల ప్రతిపాదనలపై తమ అభిప్రాయాలు చెప్పవచ్చని తెలిపారు.









అవీ..ఇవీ

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి
- 24 మందికి సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, జనవరి (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి అన్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆదివారం సాయంత్రం సీఎం సహాయనిధి చెక్కులను బాధితులకు అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని 24 మందికి రూ.10 లక్షల మేర మంజూరైన నిధులను చెక్కుల రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం పొందిన పేదలకు సకాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి అందుతోంద న్నారు. గత ప్రభుత్వ హయాంలో నెలలపాటు ఎదురుచూడాల్సి వచ్చేద న్నారు. కానీ ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోనే సీఎం సహాయనిధి అందుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి, కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, రమణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, మాలపాటి వెంకటరెడ్డి, పి.ఇబ్రహీం, రంగస్వామి, కోటి, గొలమారి నారాయణరెడ్డి, గుంటక వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి

- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి
- 35 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సంతోషమే తన సంతోషంగా నిరంతరం పరితపించి పనిచేస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో 35 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం గురించి, ప్రజల గురించి నిరంతరం ఆలోచించే వ్యక్తి చంద్రబాబునాయుడని అన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడే వారు ఎవరూ దిగులు పడాల్సిన పని లేదని, గత ప్రభుత్వం మాదిరిగా ప్రాణాలు కాపాడుకోవడం కోసం ఆస్తులు అమ్ము కోవడం, అప్పులు చేయడం వంటివి కూటమి ప్రభుత్వంలో చేయాల్సిన పనిలేదన్నారు. ప్రజల సమస్యలతోపాటు పాలనాపరమైన సమస్యల పరిష్కారానికి ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం త్వరలోనే కొత్త పరిష్కార వేదిక ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాట్సప్ ఫీచర్ ద్వారా ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేలా వివిధ శాఖలను అనుసందానిస్తూ ప్రభుత్వం త్వరలోనే నూతన విధానాన్ని అమలులోనికి తీసుకొస్తున్నట్లు తెలిపారు. మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచు కోవాలన్నారు. నియోజకవర్గంలోని 35 మందికి రూ.63,30,330 విలువైన చెక్కులను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాచర్ల మండలపార్టీ అధ్యక్షులు కటికె యోగానంద్, టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, శ్రీనివాసరెడ్డి, తదితరులు ఉన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

గిద్దలూరు టౌన్ : రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణంతోపాటు నియోజకవర్గంలో నీటి సమస్య రాకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 2వ వార్డులోని రాజానగర్ నందు నూతన డీప్‌బోరుకు ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు పట్టణంలో వర్షాలు పడినప్పటికీ ఇక్కడ ఉండే నదులు సరైన ప్రవాహం లేక భూగర్భజలాలు అనుకున్నంత గా పెరగలేదన్నారు. దీంతో వేసవిలో నీటి సమస్య రాకుండా ముందస్తుగా చర్యలు చేపట్టినట్లు ఆయన అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కౌన్సిలర్లు బి.చంద్రశేఖర్‌యాదవ్, లొక్కు రమేష్ తదితరులు ఉన్నారు.

క్రీడల్లో యువతకు ప్రోత్సాహం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యేలు శివప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : యువతను ప్రోత్సహించేందుకు ఆటల పోటీలు ఎంతో దోహదపడతాయని వైసీపీ జిల్లా అధ్యక్షులు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. క్రికెట్ పోటీల విజేతలకు ఆదివారం ఆయన బహుమతులు అందజేశారు. ఎర్రగొండపాలెంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటల పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ముందుగా వారు బ్యాటింగ్, బౌలింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌తో పాటు వైసీపీ నేత చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, జిల్లా, నియోజవర్గ, మండల నాయకులు, క్రికెట్ సభ్యులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



పండ్లు అందజేస్తున్న నాయకులు

మార్కాపురం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : యోగి వేమన జయంతి సందర్భంగా స్థానిక సర్వజన వైద్యశాలలో రోగులకు రెడ్డి సంక్షేమ సంఘం నియోజక వర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పట్టణంలోని నాయుడు వీధిలోని రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద యోగి వేమన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. వేమన పద్యాలు తెలుగు భాషలో ఎంతో ప్రాముఖ్యం పొందాయని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షమ సంఘం సభ్యులు గొలమారి కాశిరెడ్డి, గుంటక భాస్కర్‌రెడ్డి, బత్తుల వెంకటరెడ్డి, కందుల లక్ష్మిరెడ్డి, చెప్పల్లి కనకదుర్గ, కంది ప్రమీలారెడ్డి, తిరుమల రెడ్డి రామిరెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో వీరన్న చెరువు కట్ట

- యథేచ్ఛగా బంకులు, ఎరువుల దిబ్బలు ఏర్పాటు
- తొలగించాలని కలెక్టర్ ఆదేశించినా అమలుకాని వైనం



చెరువుకట్ట వెంబడి ఉన్న ఎరువుల దిబ్బలు

పుల్లలచెరువు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి నడిబొడ్డున ఉన్న కాటి వీరన్న చెరువు కట్ట అక్రమణలకు కోరల్లో చిక్కుకుంది. చెరువు కట్ట ఓ వైపు అక్రమంగా అక్రమించి బంకులు ఏర్పాటు చేయగా, మరోవైపు కట్ట వెంబడి ఎరువుల దిబ్బలు ఏర్పాటు చేశారు.



కట్టపై అక్రమంగా ఏర్పాటు చేసిన బంకులు

పుల్లలచెరువు ప్రధాన రోడ్డులోని కాటి వీరన్న చెరువు కట్ట వెంబడి నిత్యం జేడీపీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, కమ్మవారిపల్లె, తాండకు వెళ్లే ప్రజలు వెళుతుంటారు. వీరితో పాటు 10 గ్రామాల ప్రజలు కూడా ఆ వైపు వెళుతుంటారు. అయితే ఈ కట్ట వెంబడి ఆక్రమణలు, ఎరువుల దిబ్బలు, బహిరంగ మలవిసర్జనకు వెళుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ప్రధానంగా చెరువు కట్ట 300 మీటర్లుకు పైగా ఉంది. ఈ కట్టకు ఇరువైపుల చెత్త చెదారం దిబ్బలు ఏర్పాటు చేసి స్థానిక ప్రజలు బహిర్భుమికి వెళతు న్నారు. మరో వైపు కట్ట అలుగును అక్రమంచి బంకులు వేర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ఈ వైపున వెళ్లాలంటే ప్రజలు ముక్కున వేలేసుకుంటారు. నిత్యం దుర్గంధం వస్తున్నా, పాఠశాల విద్యార్థులు సైతం ఈ వైపు అనివార్యంగా వెళ్లాల్సి వస్తోంది. దీంతో గత సంవత్సరం పుల్లలచెరువు మండలం పరిశీలనకు వచ్చిన ప్రస్తుత కలెక్టరు తమీమ్ అన్సారియాకు స్థానికులు ఫిర్యాదు చేశారు. చెరువుకట్టను పరిశీలించిన ఆమె వెంటనే దిబ్బలను, ఆక్రమణ లను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా అటు పంచాయతీ అధికారులు కానీ, రెవెన్యూ అధికారులు కాని పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నాతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సేవకు సరైన వేదిక లయన్స్ క్లబ్

జిల్లా అదనపు న్యాయాధికారి శుభవాణి



న్యాయాధికారి శుభవాణి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్నరామకృష్ణ

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అన్నార్తులకు అండగా నిలుస్తూ పదిమందికి సాయం చేయాలనే తలంపు ఉన్నవారికి సరైన వేదిక లయన్స్ క్లబ్ అని 6వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మార్కాపురం లయన్స్ క్లబ్ నూతన కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తన తండ్రితో పాటు పలువురు కుటుంబ సభ్యులు కూడా క్లబ్‌లో ఎంతోకాలంగా సభ్యులుగా కొనసాగుతూ సేవా కార్యక్రమాలలో పాలు పంచుకుంటున్నారన్నారు. ఆ స్ఫూర్తితోనే కార్యక్రమానికి హాజరయినట్లు తెలిపారు. మార్కాపురం ప్రాంతంలో ఫ్లోరిన్ సమస్య అధికంగా ఉందని, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సురక్షిత మంచినీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ 316 హెచ్ జిల్లా గవర్నర్ గోపిచంద్, వైస్ డిస్ట్రిక్ గవర్నర్ హరిప్రసాద్, రావిపూడి లక్ష్మీనారాయణ, పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ మోహన్‌రావు, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి వెంకట సుబ్బయ్య, జీఎస్టీ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, జోన్ ఛైర్మన్ డా.పులి శ్రీనివాసప్రసాద్, డా. చెప్పల్లి కనకదుర్గ, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రామకృష్ణ

మార్కాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా టి.రామకృష్ణారావు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా. ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా బీవీ రంగయ్య, ఉపాధ్యాక్షులుగా కాశయ్య, హరినాథ్‌బాబు, సహాయకార్యదర్శిగా డా.ఎం. మాధవరావు, సర్వీస్ ఛైర్ పర్సన్‌గా వెంకట రామిరెడ్డి, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్‌గా కోటేశ్వరరావు, మార్కెటింగ్ ఛైర్‌పర్సన్‌గా మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మిర్చి కూలీలను ఆర్టీసీ బస్సుల్లో తరలిస్తాం

మార్కాపురం సీఐ సుబ్బారావు



ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మిర్చి కూలీలను ఈ నెల 20 నుంచి ఆర్టీసీ బస్సుల్లో తరలించేందుకు చర్యలు చేపట్టినట్లు మార్కాపురం సీఐ పి.సుబ్బారావు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం కూలీలను తరలించే ఆటోడ్రైవర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ అప్పే ఆటోలు, టెంపోలలో కూలీలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పరిమితికి మించి ఒక్క వ్యక్తిని కూడా అనుమతించేదిలేదన్నారు. ఆటోల డ్రైవర్లు మేస్త్రీలకు చెప్పి గమ్యస్థానాలకు చేరేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఎక్కేలా చూడాలన్నారు. మిరప కోతలు అయిపోయిన తర్వాత వారిని మళ్లీ గమ్యస్థానాలకు చేర్చేందుకు బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రమాదాలను నివారించేందుకు జిల్లా ఎస్పీ ఆర్. దామోదర్ ఆదేశాల మేరకు ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. ప్రయోగాత్మకంగా ఈ నెల 20వ తేదీ నుంచి కూలీలను బస్సుల్లో తరలిస్తామన్నారు. పట్టణంలోని తర్లుపాడు రోడ్డు, శ్రీనివాస థియేటర్ ప్రాంతం, కళాశాల రోడ్లలో బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. మిరప కూలీలను తరలించేందుకు అవసరమైన మేరకు ఎన్ని బస్సులనైనా ఏర్పాటు చేస్తామని డిపో మేనేజర్ ఎఎస్ నరసింహులు తెలిపారు. సమావేశంలో ఎమ్‌వీఐ ఎం.మాధవరావు, ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్, అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కొమరోలు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు సముద్రాల వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక వాసవీకన్యాకాపరమేశ్వరి దేవాలయంలో ఆదివారం ఆ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. కొమరోలు మండల అధ్యక్షుడిగా సముద్రాల వెంకటేశ్వరు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని ఆర్యవైశ్యుల అభివృద్ధికి తనవంతు కృషిచేసానని, వెనుకబడిన ఆర్యవైశ్యుల కుటుంబాలను ఆర్థికంగానూ, సామాజికపరంగానూ, రాజకీయపరంగానూ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. దేవస్థానం అధ్యక్షులు తుమ్మలపెంట వెంకట రమణ వ మాట్లాడుతూ సమాజంలో ఆర్య వైశ్యులు అన్నిరంగాల్లో ఉన్నారన్నారు. వారికి వివిధ సమస్యలు వచ్చినపుడు సంఘటితంగా న్యాయపరంగా పోరాడుదామన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షులు పోలెపల్లి ప్రవీణ్‌కుమార్, మహిళా సంఘం సభ్యులు, గ్రామ పెద్దశెట్టి మరియాల రమణయ్య పాల్గొన్నారు.

రాచర్ల మండల అధ్యక్షులుగా వెంకటరమణ

గిద్దలూరు టౌన్: రాచర్ల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా అనంపల్లెకు చెందిన లఘుమారపు వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా వెంకటరమణ, గౌరవాధ్యక్షులుగా లఘుమారపు సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా దర్శి శివప్రసాద్, కార్యదర్శిగా లింగం రమేష్, ట్రెజరర్‌గా సాదు శ్రీరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బొంతల సుధీర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పేరం ప్రసాద్ పాల్గొన్నారు.

రేపు మెగాజాబ్ మేళా

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్కిల్ స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యం లో ఈ నెల 21న స్థానిక మోడల్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఆదివారం ప్రకటన లో తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు సారధ్యంలో ఏర్పాటు చేసిన ఈ జాబ్‌మేళకు 10వ తరగతి నుండి డిగ్రీ, ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు అర్హు లన్నారు. ఆ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్విని యోగం చేసుకోవాలని అన్నారు. పూర్తి వివరాల కోసం మహే ష్, అజార్ 6302220609, 8297133297లను సంప్రదించాలన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

గిద్దలూరు టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విరా సుబ్బరత్నం కల్యాణ మండపంలో విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మార్కాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుండి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు.

25 కుక్కలు పట్టివేత

మార్కాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలను మున్సిపాలిటీ పారిశుధ్య విభాగం సిబ్బంది ఆదివారం పలు ప్రాంతాల్లో పట్టుకున్నారు. పలు ప్రాంతాల్లో తిరుగుతున్న 25 కుక్కలను ఒంగోలుకు చెందిన స్నేహ యానిమల్ కేర్ సొసైటీ సిబ్బంది పట్టి ప్రత్యేక వాహనంలో జిల్లా కేంద్రానికి తరలించారు. అక్కడ వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సతోపాటు టీకాలు వేయనున్నట్లు కమిషనర్ డీవీఎస్ నారాయణరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

కొమరోలు, జనవరి19(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడిన ఘటన కడప- అమరావతి రాష్ట్రీయ రహదారిలో పోరుమామిళ్ళ రోడ్డులోని నయారా పెట్రోలు బంకు సమీపంలో ఆదివారం చోటుచేసుకొంది. మండలంలోని యర్రపల్లి గ్రామానికి చెందిన తిరుమలరెడ్డి, కొమరోలు గ్రామానికి చెందిన రాజశేఖర్ మోటర్ సైకిల్‌లు రెండు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో వారిరువురు గాయపడ్డారు. వీరిని 108 వాహనం ద్వారా గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. వీరిలో తిరుమలరెడ్డి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది.

గెస్ట్‌హౌస్‌కు త్వరలో మరమ్మతులు

- చిన్న నీటి పారరుదలశాఖ ఈఈ పురార్ధనరెడ్డి

కంభం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కంభం చెరువుకట్టపై శిథిలావస్థకు చేరిన అతిథి గృహ నిర్మాణ మరమ్మతు పనులు త్వరలో మొదలు పెడతామని మార్కాపురం నీటిపారుదలశాఖ అధికారి పురార్ధనరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'అతిథి గృహానికి ఆలనపాలన కరువు' అనే శీర్షిక ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. కంభం చెరువుకట్టపై బ్రిటీష్‌కాలంలో నిర్మించిన అతిథి గృహం వస్తువులకు చెదలు శిథిలావస్థలో ఉండగా 2014లో జేఐసీఏ నిధులతో గెస్ట్‌హౌస్‌కు స్లాబ్ వేసి తలుపులు, కిటికీలు బిగించామన్నారు. అయితే వాచ్‌మెన్ లేకపోవడంతో ఫర్నీచర్లు దొంగిలించారన్నారు. ప్రస్తుతం కంభం చెరువును టూరిజం డెవలప్‌మెంట్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, గెస్ట్‌హౌస్ మరమ్మతులకు కూడా ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు మొదలుపెడతామన్నారు.

సత్యమాంబదేవికి మొక్కులు తీర్చుకున్న భక్తులు



కోటా సత్యమాంబదేవి

కంభం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : సర్వమతాల ఆరాధ్యదైవం శ్రీకోటా సత్య మాంబదేవి ఆలయంలో భక్తులు ఆదివారం తమ మొక్కులు చెల్లించుకున్నారు. కంభం, బేస్తవార పేట, అర్ధవీడు మండలాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు బోనాలు సమర్పించారు. నూతనంగా వాహనాలు కొనుగోలు చేసిన వారు ప్రత్యేక పూజలు చేయించారు. తాము కోరుకున్న కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన శ్రీకోటాసత్యమాంబదేవి ఆలయానికి ప్రతి ఆదివారం, పండుగ రోజుల్లో వందలాది మంది భక్తులు తరలివచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఇష్టకామేశ్వరి గూడెంలో వైద్యశిబిరం



గూడెంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఇష్టకామేశ్వరి దేవాలయ సమీపంలోని గిరిజన గూడాలలో ఆదివారం డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఆ ప్రాంతంలో నివసిస్తున్న 60 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రోగాలపై అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముందుగా గిరిజన గూడాలలో పర్యటించి టీబీ, ఆస్తమా, డెంగ్యూ రోగాలపై అవగాహన కల్పించారు. వైద్యశిబిరంలో ఏఎన్ఎంలు మాధవి లత, సుజాత, ల్యాబ్ టెక్నీషియన్ జానా రెడ్డి, సిబ్బంది వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడి మృతదేహానికి టీడీపీ నాయకుల నివాళి

పుల్లలచెరువు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): యానం ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుడిగా పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డాక్టరు పాత్లావత్ వెంకటేశ్వరనాయక్ మృతదేహానికి టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. ఆదివారం మండలంలోని నరజాముల తండాలో ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు వున్నారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు శనగా నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డిలు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సచివాలయ ఇంజనీర్లకు ప్రమోషన్ కల్పించాలి

కొమరోలు, జనవరి19 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాయం ఇంజనీర్లుకు ప్రమోషన్లు కల్పించాలని గ్రామ సచివాలయ రాష్ట్ర ఇంజనీర్ల సంఘం ఉపాధ్యక్షుడు పీవీ.శివసుర్యాతేజ ఆదివారం ఆశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయులుకు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా శివ సూర్యతేజ మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీర్లుకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. వారికి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నా బాధ్యతగా ప్రభుత్వానికి ప్రజలకు అన్నివిధాలుగా అందుబాటులో ఉండి సేవలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో మాట్లాడి పర్యష్కరించాలని కోరారు. తమకు ఆర్థిక బరోసాను కల్పించాలని కోరారు. స్పందించిన మంత్రి వీరాంజనేయులు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కే రవీంద్ర, రాజశేఖర్‌కెడ్డి, మనోజ్, అఖిల్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

- పట్టించుకోని అధికారులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం



నిరుపయోగంగా మారిన విద్యుత్‌శాఖ సిబ్బంది క్వార్టర్స్



శిథిలావస్థకు చేరిన అటవీశాఖ కార్యాలయం

కంభం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రజాఆస్తులపై నిర్లక్ష్యం తారాస్థాయికి చేరిందని చెప్పడానికి శిథిలావస్థ భవనాలు సాక్షంగా కనిపిస్తున్నాయి. మండలంలో అనేక ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరాయి. కూలేందుకు సిద్దంగా ఉన్న భవనాల్లోనే కార్యకలాపాలు సాగించే దుస్థితి లేకపోలేదు. మరికొన్ని భవనాలను అలాగే ఎందుకు పనికిరాకుండా వదిలివేశారు. ప్రజాఆస్తులపై అధికారుల వైఖరి ఎత్తి చూపుతున్నది. అటవీశాఖ, పాలకేంద్రం, విద్యుత్ వసతి గృహాలు, టెలిఫోన్ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరాయి. కంభం, కందులాపురం నడిబొడ్డున ఉన్న అటవీశాఖ కార్యాలయం చుట్టూ చెట్లు పెరిగాయి. చుట్టుపక్కల వారు గేదెలను కట్టివేస్తున్నారు. 1992లో గిద్దలూరు డివిజన్ అటవీశాఖ అధికారి ఎస్.ఎం.సెల్వరాజ్ ఈ భవనాన్ని ప్రారంభించారు. నామమాత్రంగా మూడేళ్ళపాటు అధికారులు ఇక్కడ ఉన్నారు. అనంతరం తురిమెళ్ల గ్రామాన్ని విధుల నిర్వహణకు ఎంపిక చేసుకున్నారు. దీనితో ఆశాఖ కార్యాలయ భవనాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు. అలాగే కంభం 133/11 కెవి విద్యుత్ సిబ్బంది నివాస గృహాలు, పాలకేంద్ర సిబ్బంది నివాస గృహాలు, టెలిఫోన్ కార్యాలయ భవనం గత 25 ఏళ్ళుగా నిరుపయోగంగా ఉన్నాయి. దీనితో అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు ఇప్పటికీ ప్రైవేటు భవనాల్లో అద్దెలు కడుతూ నిర్వహిస్తున్నారు. వెలుగు కార్యాలయంకు సొంత భవనం లేక అద్దెలు చెల్లిస్తూ నిర్వహిస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న భవనాలకు మరమత్తులు చేపట్టి అద్దెలు కడుతున్న కార్యాలయాలను వీటిలోకి మారిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

ఉరుకుల పరుగుల జీవనం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రతి ఒక్కరూ ప్రకృతిలో సేదతీరాలని ఆశపడుతుంటారు. చుట్టూ పచ్చదనం ఉండే వనాల్లో అయితే ఆ అనుభూతే వేరుగా ఉంటుంది. అడవి జంతువులు, పక్షులు తదితరాలు కూడా చూడగలిగే అవకాశం ఉంటే అదో ఆహ్లాదకరమైన పర్యటన అవుతుంది. అలాంటి ఏర్పాట్లను జిల్లా వాసులకు అందుబాటులో ఉంచేందుకు అటవీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. పొదిలి - కొనకనమిట్ల మధ్య చినారికట్ల జంక్షన్ వద్ద ఈ వనాన్ని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాథమిక దశలో వన సందర్శన ఉన్నప్పటికీ, త్వరలో పూర్తిస్థాయిలో విస్తరించనున్నారు.

- పర్యాటకులకు ప్రత్యేక అనుభూతి
- సందర్శకులకు ఆహ్లాదకరం
- చినారికట్ల జంక్షన్ వద్ద 125 ఎకరాల్లో ఏర్పాటు
- ఇప్పటికే రూ.1.40 కోట్లు వ్యయం
- మరో రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు



నయనానందం నగరవనం



చినారికట్ల జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన నగరవనం ప్రధాన గేటు (ఇన్‌సెట్లో) పర్యాటకులు సేదతీరేందుకు తాటిమొద్దులతో ఏర్పాటు చేసిన గుడారం

పొదిలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : పొదిలికి సమీపంలో గుండుకొండ రిజర్వ్ ఫారెస్టు 770 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీనిలో 125 ఎకరాల్లో అటవీశాఖ తరఫున వనాలను అభివృద్ధి చేస్తున్నారు.



సాయంత్రం వేళ సేదతీరేందుకు ఏర్పాటు చేసిన బెంచ్‌లు

రా ష్ట్ర

ప్రభుత్వం ఆ మేరకు ప్రోత్సాహం అందిస్తోంది. పర్యాటకులకు కొత్త అందాలతో ఆహ్లాదాన్ని అందించేందుకు ఇప్పటికే ఈ వనంలో పొదరిళ్లను సిద్ధం చేశారు. రకరకాల గుడారాలు, చెక్కబల్లలు, పిల్లల ఆడుకొనే వసతిని ఏర్పాటు చేశారు. పర్యాటకులకు ప్రత్యేక అనుభూతికలిగే విధంగా నగరవనాలను ఏర్పాటు చేస్తూ ప్రజలకు, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దీంతో ఈ నగరవనం నిత్యం పర్యాటకులతో కళకళలాడుతోంది. వారంతపు రోజుల్లో నగరవనం పర్యాటకులు అధికంగా వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నంద్యాల-ఒంగోలు ప్రధాన రహదారికి అనుకొని 125 ఎకరాల్లో రూ.1.40 కోట్ల వ్యయంతో ఈ వన నిర్మాణాలు చేపట్టారు. ఈ వనాల్లో కాంక్రీట్‌తో కాకుండా సహజసిద్ధంగా చెక్కలు, తాటిమొద్దులు, కర్రలతో అందంగా వీటి నిర్మాణాలు చేపట్టారు. అంతే కాకుండా పర్యాటకులకు మంచినీటి సౌకర్యం కోసం ఆర్వో ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేశారు. యాత్రికులు సేదతీరేందుకు జమ్ము, పూచికపుల్లలతో అందంగా పైకప్పు ఏర్పాటు చేసిన పూరిళ్లను నిర్మించారు. అందులో కూర్చోవడానికి చెక్క బల్లలు అందుబాటులో ఉంచారు. ప్రమాదకర



జంతువులు సంచరించే ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలనే హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేశారు. రెండు నెలలుగా వనంలోకి పర్యాటకులను అనుమతిస్తున్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు అనుమతిస్తున్నారు. ప్రవేశరుసుం పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10లు అమలు చేస్తున్నారు. లోపలికి వెళ్లిన పర్యాటకులు వనం అందాలతోపాటు అడవి అందాలను ఆస్వాదిస్తూ భోజనం చేసేందుకు బల్లలు ఏర్పాటు చేశారు. పిల్లలు ఆటలాడుకునేందుకు ఏర్పాటు చేసిన పరికరాలతో ఆనందంగా సేదతీరుతున్నారు. పలురకాల మొక్కలు, వృక్షాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. త్వరలో రకరకాల పక్షులను, జంతువులను తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఫారెస్ట్ అధికారి నాయక్ తెలిపారు. అడవి అందాలను తిలకించేందుకు తాటిమొద్దులతో ఎత్తుగా షెడ్లు ఏర్పాటు చేశారు. రూ. 60 లక్షలతో మరో విడత మరింత అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. పర్యాటకుల కోసం ప్రభుత్వం మంచి ఆలోచన ఎంచుకోవడంతో సందర్శకులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన మంచినీటి ఆర్వోప్లాంట్





సమావేశమైన పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

తర్లుపాడులో 1987-88 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తర్లుపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-88లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కుటుంబ సభ్యులు ఎక్కడెక్కడ స్థిరపడ్డారనే విషయాలపై ఒకరికొకరు ఆరా తీశారు. చదువుకొనే రోజుల్లో ఉన్నటువంటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను పూలమాలలతో ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థు లు శేషగిరిరావు, పి.శీనులు మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తామన్నారు. పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్‌కు రేకుల షెడ్, గ్రీన్ గేట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. వైద్యుడిగా స్థిరపడిన శీను పాఠశాలలో పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తానని, పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సుధాకర్, పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ వెన్నా రాజారామిరెడ్డి, పూర్వ విద్యార్థుల ప్రతినిధులు గాలి రంగారెడ్డి, నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, ఇబ్రహీం, మరో వంద మంది పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.



ధ్రువపత్రాలతో విద్యార్థులు

కరాటేతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం

గిద్దలూరుటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి బాలిక కరాటే నేర్చుకోవాలని, తద్వారా ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని గిద్దలూరు అర్బన్ సీఐ రామకోటయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని రాజరాజేశ్వరి బీఈడీ కళాశాల ఆవరణలో కరాటే గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టులో కరాటే కోచ్ పీవీ. సుబ్రహ్మణ్యంకు చెందిన 30 మంది విద్యార్థులకు కరాటే గ్రేడింగ్ టెస్టు నిర్వహించి అర్హులైన వారికి బెల్టులు ప్రదానం చేశారు. జనవరి 5న జిల్లా కేంద్రంలో జరిగిన కరాటే బ్లాక్ బెల్టు టెస్ట్‌లో పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ పీవీ.సుబ్రహ్మణ్యం బ్లాక్ బెల్టు ఫోర్త్ డాన్ సాధించగా పలువురు అభినందించారు. కార్యక్రమంలో మాస్టర్ మోహన్‌రావు, ఎం.రంగారెడ్డి, శిగుళ్ళపల్లి శ్రీధర్, షేక్ మహబూబ్‌బాషా, టింబర్ డిపో షబ్బీర్, చాంద్‌బాషా తదితరులు ఉన్నారు.

పంట పొలం కాదు.. భవనాసి వాగు



భవనాసి వాగులో దట్టంగా పెరిగిన తూటు కాడ

దట్టంగా పెరిగిన తూటుకాడ
నీటి ప్రవాహానికి అడ్డంకి

అద్దంకి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : చూడటానికి పంట పొలాలుగా కనిపిస్తున్నప్పటికీ.. అవి భవనాసి వాగులో పెరిగిన తూటు కాడ. బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం సమీపంలో అద్దంకి బ్రాంచి కాలువ ఎస్కేప్ వద్ద నుంచి ప్రారంభమయ్యే భవనాసి వాగుకు బల్లికురవ, అద్దంకి మండలాలలోని పలు గ్రామాల పంట పొలాలు, వాగుల నుంచి నీరు చేరుతుంది. వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహించే భవనాసి వాగు సాగర్ నీరు విడుదల జరిగినన్ని రోజులు కూడా నీటి ప్రవాహం ఉంటుంది. సుమారు 10కి.మీ దూరం ఉండే భవనాసి వాగు పొడవునా తూటుకాడ దట్టంగా పెరిగి ఉంది. దీంతో నీటి ప్రవాహనికి అడ్డంకిగా మారి వరదలు వచ్చిన సమయంలో కట్టలు కోతకు గురికావడం, పొంగి పొర్లడం జరుగుతోంది. పలు చోట్ల చెక్‌డ్యామ్‌లు ఉన్నా తూటుకాడ ఎక్కువగా ఉండడంతో నీటి నిల్వ సామర్థ్యం కూడా పూర్తిగా తగ్గిపోయింది. తూటుకాడ తొలగింపుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ప్రేమజంట నిర్బంధం?

- చెన్నైలో గోడౌన్‌లో ఉన్నట్టు సమాచారం
- రూ.15 లక్షలు ఇవ్వకపోతే చంపేస్తామంటూ బెదిరింపులు
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

కనిగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రేమ జంటను నిర్బంధించి తల్లిదండ్రులను నగదు డిమాండ్ చేస్తున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఓ జంట ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లారు. విహారయాత్రలో భాగంగా చెన్నైకు చేరుకున్నారు. అక్కడ బీచ్‌లో ఆశ్రయం ఇస్తానంటూ ఆగంతుకుడు నమ్మబలికాడు. ఈక్రమంలో వారిని గోడౌన్‌లో బంధించి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. రూ.15 లక్షలు ఇస్తే వదిలేస్తాం.. లేదంటే చంపేస్తామంటూ బెదిరించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బంధువు పేరుతో పట్టణంలో ఓ యువతి ఇంటికి మార్కాపురం ప్రాంతానికి చెందిన ఓ యువకుడు వచ్చాడు. పది రోజులపాటు ఆ ఇంట్లో ఉన్న యువకు డి మాటలకు యువతి ప్రేమలో పడింది. ఆతర్వాత తన స్వగ్రామానికి వెళ్లిపోయాడు. తరువాత యువతి వ్యవహారం తెలిసి తల్లిదండ్రులు మందలించడంతో ఈనెల 2న ఇంటి నుంచి వెళ్లిపోయింది.

ఈక్రమంలో ఈనెల 16వ తేదీ రాత్రి సమయంలో యువకుడి తండ్రికి ఓ ఫోన్ వచ్చింది. మీ అబ్బాయి, కనిగిరికి చెందిన అమ్మాయి మా వద్ద బంధీగా ఉన్నారంటూ అవతలివారు మా ట్లాడారు. ఆ మాటలు నమ్మని యువకుడి తం డ్రి అమ్మాయి కుటుంబసభ్యులు బంధువులు కావటంతో ఆవిషయాన్ని తెలిపారు. 2వ తేదీ నుంచి యువతి కనిపించటం లేదని చెప్పడంతో వీరిద్దరు కలిసి వెళ్లిపోయారని నిర్ధారించుకున్నారు. 17వ తేదీ ఉదయం యువతి పిన్నికి ఫోన్ వచ్చింది. బంధించిన విషయాన్ని పోలీసులకు చెప్తే మీ పిల్లల్ని చంపేస్తామంటూ బెదిరించడంతోపాటు చెన్నై రావాలని హుకుం జారీ చేశాడు అగంతకుడు. దీంతో యువతీ యువకుల తండ్రులిద్దరూ చెన్నై వెళ్ళారు.

అక్కడ చెన్నై సెంట్రల్ వద్ద ఉండమని తెలపడంతో.. అక్కడ ఉన్న వారివద్దకు కారులో ఓ వ్యక్తి వచ్చి ఎంతమంది వచ్చారని ప్రశ్నించాడు. ఇక్కడే ఉండాలని అరగంట తర్వాత ఫోన్ చేస్తామంటూ వెళ్ళిపోయిన వ్యక్తి ఆతర్వాత ఫోన్ చేసి మీ పిల్లల్ని వదిలి పెట్టాలంటే రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. మేము డబ్బులు తీసుకురాలేదని, పిల్లల్ని వదిలి పెట్టాలని ప్రాధేయపడినా వినకపోవటంతో వారు వెనుదిరిగి వచ్చారు. చెన్నై నుంచి వచ్చి ప్రేమ జంట తండ్రులు కుటుంబసభ్యులతో చర్చించుకున్న తర్వాత ఈ విషయాన్ని ఆదివారం పోలీసులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పోలీసులు గుట్టుచప్పుడు కాకుండా ఆగంతకుడి కాల్‌ను ట్రాక్‌చేసి ఆప్రదేశాన్ని గుర్తించారు.

'ప్రకాశం' విగ్రహానికి నివాళి

టంగుటూరి మునిమనవరాలి దంపతులకు స్వాగతం



ప్రకాశం పంతులు విగ్రహం ముందు ఆయన ముని మనవరాలు సుభాషిణి, భర్త విజయశేఖర్ దంపతులతో మిత్రమండలి సభ్యులు

అద్దంకిటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరి ప్రకాశం పంతులు ముని మనవరాలు దంపతులు ఆదివారం అద్దంకి వచ్చారు. ఈ సందర్భంగా అద్దంకి వచ్చిన ప్రకాశం పంతులు ముని మనవరాలు సుభాషిణి, భర్త విజయశేఖర్ దంపతులను అద్దంకిలోని టంగుటూరి ప్రకాశం పంతులు మిత్రమండలి సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం అద్దంకి బంగ్లారోడ్డులో మిత్రమండలి ఏర్పాటు చేసిన టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి సుభాషిణి దంపతులు, మిత్రమండలి సభ్యులతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అద్దంకిలో టంగుటూరి ప్రకాశం పంతులు పేరుమీద మిత్ర మండలి చేపట్టే వివిధ కార్యక్రమాలు, జయంతి, వర్థంతి, వివిధ పోటీలు వంటివాటిని గురించి సభ్యులు వారికి వివరించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు త్యాగనిరతిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు గాడేపల్లి దివాకర్‌దత్తు, పాలపర్తి జ్యోతిష్మతి, షేక్ మహమ్మద్ రఫీ, చందలూరి నారాయణ రావు, చప్పిడి వీరయ్య, సత్యనారాణ, మస్తాన్ మాస్టర్, లేవి ప్రసాద్, పోలిరెడ్డి, పూర్ణచంద్ర రావు, శ్రీనివాసరావు, కృష్ణారావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, నరసింగరావు, ఆచారి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల లక్ష్యాలను పిల్లలు నెరవేర్చాలి

అద్దంకిటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని, లక్ష్యాలను వమ్ము చేయకుండా పిల్లలు నెరవేర్చాలని శ్రీనివాసరావు కోరారు. యువతీయువకుల కోసం గత ఎన్నికలలో అద్దంకి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మందా శ్రీనివాసరావు వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. చదువుకుంటున్న వారు బైక్ రేస్‌ల వలన ప్రమాదాలబారిన వారి కుటుంబాల పరిస్థితిని వివరిస్తూ యువతకు జ్ఞాన బోధ చేస్తున్నారు. ప్రధానదారులు, సెంటర్‌లలో సందేశం రాసిన అట్టలను తన శరీరానికి రెండు వైపులా తగిలించుకుని శ్రీనివాసరావు ప్రచారం చేస్తున్నారు.

విద్యాశాఖ వార్తల పరిశీలనకు ప్రత్యేకాధికారి

ఒంగోలు విద్య, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖకు సంబంధించి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే వార్తలను పరిశీలించేం దుకు జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమిస్తూ పాఠశాల విద్యా కమి షనర్ వి.విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లాకు ప్రత్యేక అధికారిగా సర్వీసెస్ జాయింట్ డైరెక్టర్ ఎ.సుబ్బారెడ్డిని నియమిం చారు. పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో, మీడియాలో వచ్చే వార్తలను పరిశీలించి ఆయా సమస్యలను ప్రత్యేక అధికారులు పరిష్కరించాలి. ఏదైనా ప్రతికూల వార్తలు వస్తే వాటికి సంబంధిత అధికారుల ద్వారా వివరణలు, ఖండనలను ఇప్పించే బాధ్యత కూడా ప్రత్యేకాధికారులదే.

టీఎన్‌యూఎస్ రద్దు అవాస్తవం

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం(టీఎన్‌యూఎస్) రద్దు అవాస్తవమని, రద్దు అయిందంటూ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆ సంఘ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి స్వామిని తూర్పునాయుడుపాలెంలోని ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ మాట్లాడుతూ టీఎన్‌యూఎస్ ఎదుగుదలను, ఉపాధ్యాయులకు చేస్తున్న సేవలను ఓర్వలేక తమపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు, కె.రామలింగప్ప, చెరుకూరి పూర్ణచంద్రరావు, కె. వెంకట్రావు, రామచంద్రయాదవ్, రెహమాన్ పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రత్యేకాధికారిణికి అరుదైన గౌరవం

- తిరుమలదేవికి సావిత్రి బాయి పూలే ప్రతిభా అవార్డు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయ ప్రతేకాధికారిని తిరుమలదేవికి అరుదైన గౌరవం దక్కింది.



అవార్డు అందుకుంటున్న తిరుమల దేవి

సావిత్రి భాయ్ పూలే నేషనల్ ప్రతిభ అవార్డును ఆమె అందుకున్నారు. ఆదివారం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సౌత్రన్ ప్రైవేటు, లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ సంస్థ గౌరవాధ్యక్షులు ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పాయర్థ నాగయ్య చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఉపాధ్యాయ విద్యకు, పేద విద్యార్థులకు అందించిన సేవలను గుర్తించి ఆమెకు అవార్డు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించి జ్ఞాపికను అందజేశారు. అవార్డు గ్రహీత తిరుమలదేవి మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా పేద విద్యార్థులకు, బాలికా విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని అన్నారు.

వైద్యశాల అభివృద్ధికి విరాళం

పామూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రభుత్వాసుపత్రికి తెలుగుయువత మండల అధ్యక్షుడు, వార్డు సభ్యుడు విరాళం ప్రకటించారు. ఆదివారం కనిగిరిలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి రూ25 వేలల నగదును అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యశాల అభివృద్ధికి దాతలు అందజేస్తున్న సహకారం మరువలేనిదన్నారు.

క్రికెట్ విజేత వెంగళాపురం జట్టు

పీసీపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని వెంగళాపురంలో తెలుగుయువత ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ఆగ్రామ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం వెంగళాపురం, బైనపాలెం జట్ల మధ్య ఫైనల్ పోటీ జరిగింది. విజేతగా నిలిచిన వెంగళాపురం జట్టుకు రూ.20 వేల నగదు బహుమతిని అందజేశారు. రన్నర్‌గా నిలిచిన బైనపాలెం జట్టుకు రూ.పది వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో నాగోతు శ్రీనివాసులు, పరిమి ఈశ్వరరావు, వడ్డెంపూడి మాధవరావు, వడ్డెంపూడి పెదమాలకొండయ్య, మల్లెల లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రఘురాములు సేవలు మరువలేనివి

కనిగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పీడీసీసీ బ్యాంకు మాజీ మేనేజర్ రఘురాములు సేవలు మరువలేనివని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దిరిశవంచ గ్రామంలో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రఘురాములు సంస్మరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పీడీసీసీ బ్యాంకులో పనిచేసి పదవీ విరమణ పొందిన రఘురాములు మరణించటం బాధాకరమన్నారు. రఘురాములు దేవాంగుల అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించినట్లు చెప్పారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, టీడీపీ నాయకులు నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి మాడిశెట్టి శివశంకరయ్య, పంచాయతీ కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, బత్తుల యోగేశ్వరరావు, కొత్త సుబ్బారావు, ఉట్టి అర్జున్‌రావు, యడవల్లి ఎంపీటీసీ వట్టివేళ్ళ రంగబాబు, రఘురాములు కుటుంబసభ్యులు సతీష్‌బాబు, డాక్టర్ నరేంద్ర, డాక్టర్ మల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

దర్శి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మాడపాకుల రమేష్ బాబు, సీపీఎం కార్యదర్శి డి.రంగారావు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాకు ఆపదవిలో కొనసాగే అర్హతలేదని విమర్శించారు. రాష్ట్రంలో అమిత్‌షా పర్యటను నిరసిస్తూ ఈ ఆందోళన కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు ఆర్.కరుణానిధి, కె.ఆంజనేయులు, యు.నాగేశ్వరావు, ఇత్తడి సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో..

దొనకొండ: కేంద్రమంత్రి అమిత్‌షా పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు క్షమాపణ చెప్పాలని సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య డిమాండ్ చేశారు. దొనకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా అంజయ్య మాట్లాడుతూ డిసెంబరు 18న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో మంత్రి అమిత్‌షా మాట్లాడిన తీరు దారుణమన్నారు.

కార్యక్రమంలో కుందుర్తి చిన్ననర్సింహులు, కోలా కిరణ్‌కుమార్, మాలపోలు అంజిబాబు, మేళం సంతోష్‌కుమార్, పురుషోత్తం కాశయ్య, జె.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పామూరులో..

పామూరు: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పి మంత్రి పదవికి రాజీనామ చేయాలని సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మమ్మిడాడి సెంటర్‌లో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మధ్య మత విద్వేషాలు సృష్టిస్తూ మత రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు మౌలాలి, పి.ప్రభాకర్, షేక్ ఖాదర్‌బాషా, షేక్ మస్తాన్, షేక్ ఇస్మాయిల్, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎం.రామయ్య, వై.వీరనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు: రాష్ట్రంలో కేంద్ర మంత్రి అమిత్‌షా పర్యటను వ్యతిరేకిస్తూ ఆదివారం ముండ్లమూరులోని అంబేద్కర్ బొమ్మ వద్ద సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బోడపాటి హనుమంతరావు, పంటా ఏడుకొండలు, బొమ్మతోటి రాజా, రమేష్, పోట్లూరి సుబ్బారావు, నన్నం రామాంజనేయులు, గోపనబోయిన హనుమంతరావు, తిరుపతిరావు, పాలపర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు గొర్రెల మండి ప్రారంభం

- పదేళ్లుగా నిరుపయోగం
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చొరవతో పునఃప్రారంభం

కనిగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పదేళ్ళగా అపరిష్కృతంగా ఉన్న గొర్రెలమండి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చొరవతో తిరిగి సోమవారం పునఃప్రారంభం కానుంది. 2009 నుంచి 2014 వరకు ఎమ్మెల్యేగా ఉన్న డాక్టర్ ఉగ్ర పొగాకు వేలం కేంద్రం ఎదురుగా గొర్రెల పెంపకందారుల సంక్షేమం కోసం గొర్రెలమండి ఏర్పాటుచేశారు. గొర్రెల పెంపకందారులు తమ జీవాలను కొనుగోలు, అమ్మకం, ఇతర ప్రాంతాలకు ఎగుమతికై ఎంతో అనుకూలంగా ఉండేందుకు అప్పట్లో డాక్టర్ ఉగ్ర గొర్రెల మండిని ఏర్పాటుచేయించారు. అందులో షెడ్లు వేయించి వసతులు సమకూర్చారు.

ఆతర్వాత పదేళ్లపాటు పాలించిన నాయకులు గొర్రెల మండిని పూర్తిగా నిరుపయోగంగా మార్చారు. దీంతో గొర్రెలమండి నిరుపయోగం మారి వేసిన షెడ్డులు శిథిలమై పడిపోయాయి. కొండ దిగువ కావటంతో చెట్లు విపరీతంగా పెరిగిపోయాయి. పాములకు నివాసంగా మారింది. 2024 ఎన్నికల్లో తిరిగి ఎమ్మెల్యేగా గెలి చిన డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అప్పట్లో ఆయన చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నారు.

సోమవారం పొదిలి రోడ్డులో గొర్రెలమండి తిరిగి వినియోగంలోకి తేనున్నారు. దీంతో గొర్రెల పెంపకం దారులకు ఎంతో మేలు చేకూరనుంది

ఆర్యవైశ్యులందరూ ఐక్యంగా ఉండాలి

- మాజీ మంత్రి శిద్దా రాఘవరావు



గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్‌ల చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు అమరా శ్రీరామమూర్తి



మాట్లాడుతున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

ముండ్లమూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు కలసికట్టుగా ముందుకు సాగాలని మాజీమంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. అందరూ ఒక తాటి పై ఉంటే ఎలాంటి సమస్యనైనా సులువుగా ఎదుర్కోవచ్చని అన్నారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా ఉమామహేశ్వర అగ్రహారంకు చెందిన అమరా శ్రీరామమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం వేంపాడులోని ఆంజనేయస్వామి సన్నిదిలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా జరిగిన సభలో శిద్దాతో పాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ పాల్గొన్నారు. శిద్దా మాట్లాడుతూ తాను ఎల్లప్పుడు ఆర్యవైశ్యులకు అండగా ఉంటానన్నారు.

డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలితసాగర్‌లు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సమిష్టిగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యాపారస్తులపై అనేక ట్యాక్స్‌లు వేసి ఆర్థికంగా దెబ్బతీసిందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలలోనే అన్ని సామాజిక వర్గాలు తమ రంగాల్లో రాణిస్తూ సంతోషంగా ఉంటున్నారని చెప్పారు. ఆర్యవైశ్యులకు తమ వంతు సహాయం ఉంటుందన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు అమరా శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి లలిత సాగర్, శిద్దా రాఘవరావును ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కోటా హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు సూరె చిన సుబ్బారావు, బొగ్గరపు సుబ్బారావు, దేవతి వరప్రసాద్, కోట వెంకటేశ్వర్లు, అమరా భానుప్రకాశరావు, పులికొండ శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, నాగసూరి సుబ్బయ్య, చేపూరి రమేష్, మిత్తింటి పుల్లారావు, చాటకొండ హనుమంతరావు, అమరా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా అమరా శ్రీరామ్మూర్తి, ప్రధాన కార్యదర్శిగా అమరా ప్రసాద్, కోశాధికారిగా నిత్తింటి పుల్లారావు, ఉపాధ్యక్షులుగా కనిగండ్ల సుధాకర్, పొత్తూరి శ్రీను, గార్లపాటి శ్రీను, కోట ఆంజనేయులు, శంకర్, కార్యవర్గసభ్యులుగా వలేటి రమేష్, జువ్వాజి చంద్రశేఖర్, గుణుపూడి సురేష్, శిఖాకొల్లి సురేష్, జిల్లా కమిటీ మెంబర్లుగా అమరా వెంకటేశ్వర్లు, గార్లపాటి సుబ్బారావు, గార్లపాటి సత్యనారాయణ, నరహరి నారాయణ, రాష్ట్ర మెంబరుగా అమరా నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అదుపుతప్పి కారు బోల్తా.. ఒకరి మృతి

దర్శి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అతి వేగం నిండు ప్రాణాన్ని బలికొంది. మండలంలోని తూర్పువీరాయపాలెం వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పువీరాయపాలెం గ్రామానికి చెందిన ఎం.అనీల్(25), స్నేహితులు ధర్మారావు, చినబాబులు కలిసి కారులో బొట్లపాలెం వెళ్లారు. పనిముగించుకుని గ్రామానికి వస్తున్నారు. ఈక్రమంలో కారు అతి వేగంతో అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి పొలాల్లో బోల్తాపడింది. ముగ్గురికి తీవ్ర గాయాలు కావటంతో దర్శి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో అనీల్ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య నిండుగర్భిణి. అదృష్టవశాత్తు అక్కడ పెనుప్రమాదం తప్పింది. కారు ఢీకొట్టడంలో విద్యుత్ స్తంభం విరిగిపడింది. విద్యుత్తు తీగలు కారుపై పడినట్లయితే ఘోరప్రమాదం జరిగేది. మృతుడు అనీల్ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మిగిలిన ఇద్దరు క్షతగాత్రులకు వైద్యం అందిస్తున్నారు.

ఆటోలో నుంచి జారిపడి..

కనిగిరి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆటోలో నుంచి జారిపడి మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున పట్టణ సమీపంలోని అర్బన్‌కాలనీ వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ టి.శ్రీరాం తెలిపిన వివరాల ప్రకారం.. కనిగిరి పట్టణంలోని కొత్తపేటలో నివసం ఉంటున్న మడతల ఓబులమ్మ (65) హెచ్ఎంపాడు నుంచి ఆటోలో కనిగిరి వస్తున్నారు. ఈక్రమంలో అర్బన్‌కాలనీ వద్ద ఆటో గుంతలో పడటంతో కుదుపులకు ఓబులమ్మ జారి రోడ్డుపై పడింది. తలకు బలమైన గాయమవటంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



తూర్పువీరాయపాలెం సమీపంలో బోల్తాపడిన కారు

బైకుపై నుంచి పడి..

కనిగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బైకుపై వెళ్తూ ఈనెల 3వ తేది రాత్రి అదుపుతప్పి కిందపడిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చెన్నైలో చికిత్స పొదుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ శ్రీరాం తెలిపిన వివరాల ప్రకారం మండలపరిధిలోని బొటికర్లపాడు గ్రామానికి చెందిన గంగవరపు మల్లిఖార్జునరెడ్డి (45) బైకుపై తన స్వగ్రామానికి బైకుపై వెళ్తున్నాడు. బైకు అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయం కాగా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ఒంగోలు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో చెన్నై ఆసుపత్రి కి తరలించి చికిత్స అందిస్తున్నారు. రెండు వారాలుగా మృత్యువుతో పోరాడి చివరకు మరణించాడు. మృతుడు బొట్టికర్లపాడు గ్రామంలో రేషన్‌షాపు డీలర్. ఆయనకు భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన మరణంతో ఆ గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

తాళ్లూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామభద్రాపురం గ్రామంలో జరగనున్న రీసర్వేకు రైతులు సహకరించాలని మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం రీసర్వేపై గ్రామంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సోమవారం నుంచి గ్రామంలో రీ సర్వే జరుగుతుందన్నారు. రీసర్వేతో శాశ్వత భూమిహక్కు పత్రాలు పొందవచ్చునని చెప్పారు. సర్వే జరిగే సమయంలో రైతులు అందుబాటులో ఉండాలన్నారు. వీఆర్ఏల ద్వారా రైతులకు నోటీసులు పంపినట్టు చెప్పారు. రైతులు సర్వే జరిగే సమయంలో తమ వద్ద పొలం తాలూకు హక్కు పత్రాలను తీసుకురావాలని కోరారు. ఎఫ్ఎల్ఆర్‌లో ఉన్న విస్తీర్ణం, పొలాల తాలూకు ఆన్‌లైన్‌లో ఉన్న విస్తీర్ణం, అనుభవంలో ఉన్న విస్తీర్ణం సరిగా ఉన్నది, లేనిది కొలతలు తీయటం జరుగుతుందన్నారు. ఏవైనా పొరపాట్లు, తేడాలు ఉంటే వెంటనే రెవెన్యూ సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులు రీసర్వే జరుగుతున్న సమయంలో అందుబాటులో లేకుండా, తమ వద్ద ఉన్న ఆధారాలు చూపకుంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. రైతులు తప్పనిసరిగా భూమి వద్దకు రావాలన్నారు. తమ పొలాలకు చెందిన గట్లను సర్వేయర్‌లకు చూపించాలన్నారు. రైతాంగం రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో సర్పంచ్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియేల్‌రాజు, వీఆర్వో చంద్రశేఖర్‌రావు, విలేజ్ సర్వేయర్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ముండ్లమూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్‌చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పూరిమెట్ల, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల్లో మిరప తోటలను పరిశీలించారు. ఇటీవల మిరప తోటలకు పలు రకాల తెగుళ్ళు సోకటంతో దిగుబడి పడిపోయింది. దీంతో ఆయన తోటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఏ రైతుకూ అన్యాయం జరగదన్నారు. ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ఏ పంటకు గిట్టుబాటు కల్పించకుండా రైతులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు.

ఇటీవల ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులు ధాన్యం నష్టపోకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో వ్యవసాయశాఖ మంత్రితో పాటు తాము వెళ్ళి రైతులకు ధైర్యం చెప్పి ధాన్యం కొనుగోలు చేసినట్టు చెప్పారు. 20 గంటల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోడెగ మస్తాన్ రావు, ఎంపీటీసీ చింతలపల్లి వెంకటేశ్వరరావు, నిడిగంటి నారాయణ, ఎర్రబోలు చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు

- డీఎస్పీ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నేరాల అదుపునకు ప్రత్యేక దృషి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిరోజు వాహనాలను తనిఖీ చేయాలన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వాహన చోదకుడు హెల్మెట్‌తోపాటు వాహన పత్రాలు కలిగి ఉండే విధంగా చూడాలన్నారు. మండలంలో ఏడాది నుంచి నమోదైన కేసులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు.

కార్యక్రమంలో సీఐ వై.రామారావు, ఎస్ఐ నాగరాజు, తాళ్ళూరు ఎస్ఐ మల్లికార్జునరావు, ఏఎస్ఐలు హనుమంతరావు, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

క్రీడల్లో యువత రాణించాలి

కనిగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో యువత రాణించాలని జడ్పీటీసీ కస్తూరిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వాగుపల్లి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జడ్పీటీసీ కస్తూరిరెడ్డి మాట్లాడుతూ వాగుపల్లి పంచాయతీ పరిధిలోని యువత క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనపరిచారన్నారు. గ్రామాల్లో నిర్వహించే క్రీడలు యువతలో స్నేహబంధాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడల్లో ఆసక్తి కలిగిన యువత జిల్లా, రాష్ట్ర, దేశస్థాయిలో రాణించేలా కృషి చేయాలన్నారు. ఎంపీపీ ప్రకాశం, మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ గ్రామాల్లో యువత క్రీడల పట్ల ఆసక్తి చూపడం అభినందనీయమన్నారు. విజేతగా నిలిచిన ఏరువారిపల్లి జట్టుకు రూ.20 వేలు, రన్నర్‌గా నిలిచిన వాగుపల్లి జట్టుకు రూ.15 వేలు, మూడో స్థానంలో నిలిచిన వాగుపల్లి జూనియర్స్ జట్టుకు రూ.10 వేలు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మార్తాల వెంకటేశ్వర్లు, గోపాల్‌రెడ్డి, వీరంరెడ్డి బాబు, వెంకటేశ్వరరావు, నాగేంద్రబాబు, భార్గవ్, ఇర్మానియా, ప్సంగి, ఈశ్వరరావు, రమేష్, సైదులు, హనుమంతు, చిన్నవెంకటసుబ్బయ్య, కృష్ణారెడ్డి, వెంకటనారాయణ, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్య క్షేత్రంగా వెలుగొందుతూ సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిదిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ తల్లిపై భక్తితో దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పెట్టి చల్లంగా కరుణించమ్మా అంటూ వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయబ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, విజయలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), జనవరి 19(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారి మూల విరాట్‌కు అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. గాలి గోపురం వద్ద నుంచి మేళతాళాలతో మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణ చేసి స్వామి వారికి సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. గోశాలలోని గోవులకు పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈవో నరసింహాబాబు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారులను పరిశీలించిన వైద్యాధికారులు



పింఛన్ పొందుతున్న వ్యక్తిని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

దొనకొండ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో రూ.5 వేలు పింఛన్ పొందుతున్న పలువురు లబ్ధిదారులను ఆదివారం వైద్యాధికారుల బృందం పరిశీలించారు. మండలంలోని మల్లంపేట, గంగదేవిపల్లి, రాగముక్కపల్లి, పోలేపల్లి గ్రామాల్లో ఐదుగురు అనారోగ్యానికి గురై ఆరోగ్య పింఛన్‌లో రూ.15వేలు పొందుతున్నారు. వీరిని ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు చెందిన డాక్టర్ సౌజన్య, దర్శి ప్రభుత్వ వైద్యశాలకు చెందిన డాక్టర్ విజయ్ చంద్ర, స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సునీత పరిశీలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి, సదరన్ సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పూర్తి నివేదికలను ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మన్నెం శ్రీనివాస రావు, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గురువులతో పూర్వ విద్యార్థులు

పామూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పామూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. 1978 - 79లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక స్థానిక అనిల్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ముందుగా అప్పటి గురువులు ఓరుగంటి సింగయ్య, పెరుగుపల్లి సుబ్రహ్మణ్యంతో కలిసి నాడు విద్యను అభ్యసించిన ఉన్నత పాఠశాలను తిలకించారు. డాక్టర్ షేక్ ఖాదర్ బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తమకు విద్యాబ్యాసం చేసిన గురువులను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న హెచ్ఎం ఎం.రామస్వామి, కళాశాల అధ్యాపకుడు గుత్తి రమణయ్య మాట్లాడుతూ క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు చేరుకొంటారన్నారు. చదువుకొన్న పాఠశాలకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు.

కార్యక్రమంలో డాక్టర్ ఎన్‌వీఎస్ దీక్షితులు, డాక్టర్ రమణారెడ్డి, సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి సయ్యద్ హనీఫ్, ఏలూరు ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ వెంకట్రామిరెడ్డి, రాయవరపు మాల్యాద్రిచౌదరి, జగదాబి మాల్యాద్రి, సయ్యద్ చినమౌలాలి, షేక్ గౌస్‌బాషా, కేవీఎస్ ప్రసాద్, రాచూరి నరసింహులు, డేవిడ్, కందుల నారాయణరెడ్డి, పందిటి శ్రీనివాసులు, శివప్రసాద్, మద్దెల వెంకటేశ్వర్లు, రాగిపాటి ఆంజి, పాటోలు విజయలక్ష్మి, దరిశి లక్ష్మీరాజ్యం, చుండూరు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు కలిసిన వేళ..



కురిచేడులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కురిచేడు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కురిచేడు వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాడు 127 మంది వరకు ఈ పాఠశాలలో పదో తరగతి చదివారు. వారంతా నేడు వివిధ రంగాలలో స్థిరపడ్డారు. తాము చదివిన పాఠశాలను గుర్తు చేసుకుంటూ నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ తరగతి గదులను కలియ తిరిగారు. ఆనాడు తమకు చదువు నేర్పిన గురువులతో కలిసి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. పాఠశాలకు ప్రింటర్‌ను బహూకరించారు.

మృతుని కుటుంబానికి సాయం

ముండ్లమూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉల్లగల్లు ఎస్సీ కాలనీకి చెందిన పునుగుపాటి విజయరావు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దర్శికి చెందిన మానవతా స్వచ్ఛంద సంస్థ విజయరావు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు అందజేశారు. గ్రామానికి చెందిన రెడ్డిమాసు వీరరాఘవులు మరో రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు దేవతి వరప్రసాద్, కన్వీనర్ కె.శ్రీనివాసరెడ్డి, కోశాధికారి గొర్రెపాటి వేణు, డైరెక్టర్ రెడ్డిమాసు రాఘవులు, సర్పంచ్ జనమాల నాగేంద్రం పిచ్చయ్య, బిక్షాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ

ముండ్లమూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోలవరంకు చెందిన నంబూరి సురేష్‌ను కులం పేరుతో అదే గ్రామానికి చెందిన కొర్రపాటి శ్రీనివాసరావు, మరికొంత మంది దూషించి దాడి చేశారని ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో డిసెంబరు నెలలో కేసు నమోదైంది. దీంతో దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ ఆదివారం గ్రామంలో పలువురిని విచారించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసు దర్యాప్తులో ఉందన్నారు. నేరం రుజువైతే నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.



- నేటి నుంచి గ్రామాల్లో వైద్య శిబిరాలు
- ఉచితంగా పరీక్షలు, టీకాలు, శస్త్రచికిత్సలు
- పశుసంవర్ధకశాఖ నేతృత్వంలో 31 వరకు నిర్వహణ
- పెంపకందారులు వినియోగించుకోవాలని సూచన



పశు వైద్యానికి.. పెద్దపీట

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం.. పాడి పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే మినీ గోకులాల నిర్మాణాలను ప్రోత్సహిస్తోంది. గోకులాలను పశువుల పెంపకందారులకు 90 శాతం రాయితీపై నిర్మిస్తోంది. గేదెలు, గొర్రెలు, మేకల పెం పకానికి ఊతం ఇస్తోంది. పాడి రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలను కూడా చేపట్టింది. పశు పెం పకందారులకు, పశు పోషకులకు మేలు చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో పశు వుల వైద్యానికి కూటమి ప్రభు త్వం పెద్దపీట వేస్తోంది. పశువులను వైద్యశాలలకు తీసుకు వచ్చేందుకు ఎన్నో వ్యయప్రయాసలకు గురవు తున్నారు. ఈ పరిస్థితుల్లో పశువులను వైద్యశా లలకు తీసుకురావాల్సిన అవసరం లేకుండానే వైద్య సేవలను వారి ముంగిట్లో అందుబాటు లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పశు ఆరోగ్య శిబిరాలను అన్ని గ్రా మాల్లో నిర్వహించనున్నారు. ఇందుకు పశుసం వర్ధక శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సోమవారం నుంచి వైద్య శిబిరాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 31 వరకు వైద్య శిబిరాలను నిర్వహిస్తారు. పశుసంవర్ధకశాఖ సిబ్బంది బృందాలుగా ఏర్పడి సహాయ సంచాలకులు, పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకుల ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహిస్తారు. ప్రతి బృందంలో వెట ర్నరీ అసిస్టెంట్ సర్జన్, సిబ్బంది ఈ బృందంలో ఉంటారు. ప్రతి మండలంలో రోజుకు రెండు నుంచి మూడు గ్రామాల్లో శిబిరాలు నిర్వహించనున్నారు. వైద్య శిబిరాలను పెంపకందారులు వినియోగించు కోవాలని అధికారులు కోరారు.

టీకాలు కూడా ఉచితంగానే..

వైద్య పరీక్షలతో పాటు అవసరమైన మందులు, టీకాలు, శస్త్ర చికిత్సల సేవ లను ఆయా శిబిరాల్లో ఉచితంగా అంది స్తారు. ప్రతి ఒక్క గ్రామంలో అన్ని పశు వులు ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, చిన్నదూడలకు వైద్యం అందిస్తారు. వైద్య శిబిరాలను పశు పోషకులు, పెంపకందా రులు సద్వినియోగం చేసుకునేలా గ్రా మాల వారీగా పశుసంవర్ధకశాఖ సి బ్బంది ప్రచారం నిర్వహిస్తోంది. పశు వులను వైద్యులచే పరీక్షించి ఉచితంగా వైద్యంతో తేలికపాటి శస్త్రచికిత్సలు అక్కడికక్కడే చేసేలా ఏర్పాట్లు చేస్తు న్నారు. శిబిరాల్లో అన్ని రకాల గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి తగువైద్యం అందించనున్నారు. పశువు లు, చిన్న దూడలు, సన్నజీవాలకు (గొర్రెలు, మేకలకు) నట్టల నివారణ మందు ఉచితంగా తాగిస్తారు. పశు ఆరోగ్య సంరక్షణలో భాగంగా అన్ని గ్రా మాల్లో సామూహికంగా పశువులకు (ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు) వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేస్తారు.

స్లీపర్ బోగీలూ.. కిటకిటే

కాలు తీసి కాలు పెట్టేందుకు వీలుండదు.. స్టేషన్ వచ్చి దిగే ప్రయాణికులు, ఎక్కే ప్రయాణికుల పోరాటాలు.. ఇదీ జనరల్ బోగీల్లో కనిపించే దృశ్యాలు. ప్రయాణికులు రైలు ఎక్కలేక ప్రయాణాల్ని విరమించుకో వడం.. గమ్యస్థానంలో దిగలేక మరో పోవడం ప్రయాణికులకు పరిపాటిగా మారుతోంది. ఇలాంటి ఇబ్బందులు లేకుండా భారమైనా పలువురు రిజర్వేషన్లు చేసుకుని ప్రయాణాలు చేస్తున్నారు. అయితే జనరల్ బోగీల్లోకంటే దారు ణంగా రిజర్వుడు బోగీల్లో పరిస్థితి నెలకొందంటే ఆశ్చర్యం కాదు. కరోనా తర్వాత నుంచి ప్రయాణి కులకు రైలు ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. అయినా రైల్వే అధికారుల తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- జనరల్ బోగీల కంటే పరిస్థితి ఘోరం
- రిజర్వేషన్ టిక్కెట్ లేకుండానే ప్రయాణికుల ప్రవేశం
- టాయ్‌లెట్లకూ వెళ్లలేకపోతున్న రిజర్వుడ్ ప్రయాణికులు

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దూర ప్రాంతాల నుంచి గుంటూరు మీదగా రాకపోకలు సాగించే రైళ్లలో స్లీపర్‌క్లాస్ కోచ్‌లు జనరల్ బోగీల కంటే ఘోరంగా ఉంటోన్నాయి. రిజర్వుడ్ బోగీల్లోకి ఎవరింటే వారు ఎక్కేస్తున్నారు. ఫుట్‌బోర్డులు, టాయ్‌లెట్స్, కోచ్ మధ్యలో ఉండే దారి, కంపార్టు మెంట్లలో ఎక్కడ ఖాళీ కనిపిస్తే అక్కడ కూర్చుంటూ రిజర్వుడ్ ప్రయాకులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మహిళలు, వృద్ధులు, షుగర్ వ్యాధిగ్ర స్తులు, పిల్లలు అత్యవసరమై కనీసం టాయ్‌లెట్స్‌కు కూడా వెళ్లలేని పరిస్థితి స్లీపర్‌క్లాస్ బోగీల్లో నెలకొంటున్నది. జనరల్ బోగీల్లో ఎక్కలేని వారంతా సమీపంలోని రిజర్వుడు బోగీలను ఆశ్రయిస్తున్నారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా రైళ్లను, బోగీలను పెంచాల్సిన రైల్వే ఆ విషయాన్ని మరిచింది. గుంటూరు మీదగా ఒడిస్సా, బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల నుంచి ఎక్కు వ మంది విశాఖ, ఫలక్‌నుమా, షాలిమార్, వాస్కో డిగామా, సిల్చార్, ప్రశాంతి, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, శబరి, అమరావతి, బెంగళూరు, హుబ్లీ, తిరువనంతపురం వైపు వెళ్లే రైళ్లలో అత్యధికంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వాసులు ప్రయాణిస్తుంటారు. గతంలో రిజర్వుడ్ బోగీల్లో కేవలం కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్ ప్రయాణికులు మాత్రమే ఎక్కేవారు. వెయిటింగ్ లిస్టు టిక్కెట్ ఉన్న వారికి ఎక్కడైనా ఖాళీలుంటే టీటీఈలు సీట్లు కేటాయించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఏ ఒక్క రైలులోనూ కనిపించడం లేదు. పండుగ సెలవుల రద్దీ సీజన్‌లోనే కాకుండా సాధారణ రోజుల్లోనూ రిజర్వుడు బోగీలు కూడా కిటకిటలాడు



స్లీపర్ క్లాస్ బోగీలో పరిస్థితి

తున్నాయి. స్లీపర్‌క్లాస్‌లో టిక్కెట్లు బుకింగ్ చేసుకోవడానికి భయపడిపోతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ప్రయాణికుల బాధ వర్ణనాతీతం

అనధికార వ్యక్తులు స్లీపర్‌క్లాస్‌లో చేరడంతో సౌకర్యాలు, భద్రతపరంగా ఇబ్బంది పడుతున్నామని ప్రయాణికులు మొర పెట్టుకుంటున్నా అటు ఆర్‌పీఎఫ్ ఇటు రైల్వే కమర్షియల్ విభాగం అధికారులు ఆలకించడం లేదు. ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చే ప్ర యాణికుల్లో ఎక్కువ మంది గుట్కా, జర్దా నములుతుంటారు. వారు అలానే బోగీల్లో ఎక్కడపడితే అక్కడ ఉమ్మి వేస్తూ ఇతరులకు నరకం చూపిస్తున్నారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే వారంతా ఒక్కటై తిరగబడుతున్నారు. ప్రయాణికులు ట్విట్టర్, ఇతర కంప్లయింట్ నంబర్లకు నివేదించినా ఫలితం శూన్యం.

క్రమక్రమంగా స్లీపర్‌క్లాస్‌ల కనుమరుగు

రైళ్లలో మధ్యతరగతి వర్గాల ప్రజలకు క్రమక్రమంగా స్లీపర్‌క్లాస్ బోగీలు కనుమరుగు అవుతు న్నాయి. గతంలో ఒక్కో రైలుకు కనీసం 12 నుంచి 14 స్లీపర్‌క్లాస్‌లు ఉండేవి. ఇప్పుడు కొన్ని రైళ్లు మినహా అన్నింటిలో మూడు, నాలు గుకు కుదించేశారు. వాటి స్థానంలో త్రీటైర్, టూటైర్, త్రీఏ ఎకానమి బోగీలను తీసుకొచ్చి ప్రయాణికులపై మూడింతల భారాన్ని మోపుతున్నారు. ఇటీవల కాలంలో ఏసీ త్రీటైర్‌లోనూ అనధికార వ్యక్తులు ప్రవేశిస్తున్న సంఘటనలు భయపడుతున్నాయి.

ప్రమాదం జరిగితే అంతే సంగతులు...

ఇటీవల కాలంలో ఒడిస్సా, బెంగాల్ రాష్ట్రాల్లో రైళ్ల ప్రమాదాలు జరిగినప్పుడు భారీగా ప్రాణనష్టం సంభవించింది. అందుకు అనధికార వ్యక్తులు ఎక్కువ సంఖ్యలో స్లీపర్‌క్లాస్‌లలో ఉండటం కూడా ఒక కారణం. కాగా ఏదైనా ప్రమాదం జరిగితే రిజర్వుడ్ ప్రయాణికులను సులభతరంగా గుర్తించవచ్చు. ఇందుకు కార ణం వారి పేర్లు, ఫోన్ నంబరు రైల్వే వద్ద నమోదై ఉంటుంది. టీటీఈలు ఈఎఫ్‌టీలు రాస్తున్న అనధికార వ్యక్తులకు సంబం ధించి ఎలాంటి సమాచారం అందుబాటులో ఉండదు. అప్పుడు వారి కుటుంబాలకు క్లెయిమ్‌లు చేయాలన్నా కుదరని పరిస్థితి. భద్రత విషయంలో కఠినంగా ఉండాలని రైల్వే జీఎం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు.

టార్గెట్లతోనే తంటా..

కేవలం కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్లు కలిగిన ప్రయాణికులను మాత్రమే అనుమతించాల్సిన బోగీల్లోకి ఎవరిని పడితే వారిని ట్రావెలింగ్ టిక్కెట్ ఎగ్జామినర్(టీటీఈ)లు ఎక్కించేస్తున్నారు. వారికి కేటాయిం చిన పెనాల్టీల లక్ష్యాన్ని అధిగమించడానికి దీనిని అవకాశంగా చేసుకుం టున్నారు. కొన్ని రైల్వేస్టేషన్లలో అయితే టీటీఈలు ప్లాట్‌పాం నిలబడి వారే పెనాల్టీ కట్టించుకుని లోపలికి వెళ్లి ఎక్కడో ఒక చోట కూర్చోమని సలహా ఇస్తున్నారు. ప్రతీ టీటీఈ/స్క్వాడ్ రోజు/నెలకు ఇంత మొత్తం పెనాల్టీ రూపంలో వసూలు చేయాలని రైల్వే కమర్షి యల్ విభాగం అధికారులు టార్గెట్లు పెడుతున్నారు. వాటిని చేరుకో కపోతే మందలింపులు ఎదుర్కోవాల్సి వస్తుండటంతో స్క్వాడ్/టీటీఈలు సులభంగా ఉండే ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. టిక్కెట్ లేకుండా ఎక్కినా ఫైన్ రాసి ఇస్తున్నారు. ఒక్కో టీటీఈ రో జుకు రూ.25 వేలకు పైగా ఇలా ఫైన్ల రూ పంలో వసూలు చేస్తున్నారు.

ఉత్తమ నాటిక.. జనరల్ బోగీలు

- ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా 27వ మైలురాయి
- బహుమతులను అందజేసిన కళాపరిషత్ సభ్యులు

యద్దనపూడి(మార్టూరు), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో నాలుగురోజులుగా జరిగిన ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా జనరల్ బోగీలు ఎంపికైంది. శనివారం రాత్రి ఉత్తమ ప్రదర్శ నల వివరాలను కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు ప్రక టించారు. శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు(గుంటూరు జిల్లా) వారిచే ప్రద ర్శించిన జనరల్ బోగీలు, ద్వితీయ ప్రదర్శనగా యంగ్ థియేటర్ విజయ వాడ వారు ప్రదర్శించిన 27వ మైలురాయి నాటికలను ఎంపిక చేశారు. ఉత్తమ తృతీయ ప్రదర్శనగా మైత్రి కళా నిలయం వారు ప్రదర్శించిన బ్రహ్మ స్వరూపం నాటికను ఎంపిక చేశారు. ప్రత్యేక జ్యూరీ ప్రదర్శనగా చైతన్య కళా స్రవంతి విశాఖపట్నం వారు ప్రదర్శించిన (అ)సత్యం నాటి కను ఎంపిక చేశారు. ఉత్తమ నటుడిగా స్వేచ్ఛ నాటికలోని ఆనంద్, మూర్తి పాత్రలధారి గోవాడ వెంకట్, ఉత్తమనటిగా జనరల్‌బోగీలు నాటి కలో సావిత్రమ్మ పాత్రధారి సురభిప్రభావతిని ఎంపిక చేశారు. న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారు ప్రదర్శించిన ఐహేట్ ఇండియా నాటికలో విలన్ పాత్రధారి, దర్శకత్వం వహించిన డాక్టర్ ఎంఎస్ చౌదరి ఉత్తమ విలన్‌గా, ఉత్తమ దర్శకుడిగా ఎంపిక య్యారు. కళాకారులకు మెమెంటోలను, నగదు బహుమతులను అందచే శారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా నూతలపాటి కాళిదాసు, దేవేంద్ర, డాక్టరు రాయల్‌హరిశ్చంద్ర వ్యవహరించారు. పోటీలను గుదే తారకరా మారావు, ఎం.ఈశ్వరప్రసాద్, కందిమళ్ల సాంబశివరావు, కొరటాల వంశీ, పెడవల్లి వెంకటేశ్వర్లు, నిమ్మల సాంబశివరావు పర్యవేక్షించారు.



జనరల్ బోగీలు నాటిక కళాకారులకు జ్ఞాపికలు, నగదు బహుమతిని అందజేస్తున్న కళాపరిషత్ సభ్యులు

అక్రమ కట్టడాలపై చర్యలకు రంగం సిద్ధం

15 మందిపై చార్జిషీటు.. 25 నిర్మాణాలకు నోటీసులు

బాపట్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎవరు పట్టించుకోరనే భావనతో పట్టణంలో యథేచ్ఛగా నిర్మించిన అక్రమకట్టడాలపై మున్సిపల్ అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు. మార్కెట్‌యార్డు, ఎల్‌ఐసీభవనం, జమ్ములపాలెం ఆర్‌వోబీ పక్కన, భావన్నారాయణస్వామి దేవాలయం ద గ్గర, పాతబస్టాండ్‌లో, కర్లపాలెంరోడ్డులోని అక్రమ నిర్మాణదారులకు నోటీ సులు జారీ చేసినా స్పందించలేదు. దీంతో 15 కట్టడాలకు సంబంధించిన వారిపై చార్జిషీట్ దాఖలు చేసినట్లు కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. 25 నిర్మాణాలకు సంబంధించి నోటీసులు జారీ చేశామన్నారు. డీ, బీఫారం స్థలాల్లో చేపట్టిన నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో నోటీసులు పంపిస్తున్నట్లు పట్టణ ప్రణాళిక విభాగాధికారి మల్లికార్జునరావు తెలిపారు. ఒకవిధంగా ప్లాన్ తీసుకుని మరొక విధంగా నిర్మాణం చేపట్టిన వారికి కూడా నో టీసులు జారీ చేస్తున్నట్లు చెప్పారు.

30 నుంచి.. రీసర్వే


- పునః ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి
- సభలు, ర్యాలీలతో ప్రజల్లో అవగాహన
- 25 నుంచి కార్యక్రమాలకు అధికారులు సిద్ధం
- వైసీపీ హయాంలో తూతూమంత్రం.. తప్పులేతప్పులు
- ఈసారి పొరపాట్లకు తావులేకుండా యజమాని, గ్రామస్తుల సమక్షంలో కొలతలు

(చీరాల, ఆంధ్రజ్యోతి)

హద్దులు మారిపోయాయి.. విస్తీర్ణం తగ్గిపోయింది.. వివరాల్లో తప్పులు.. ఇలా గత వైసీపీ హయాంలో భూముల సర్వే జరిగింది. వివా దాలు తగ్గించేందుకు అని చెప్పి చేపట్టిన సర్వే సరికొత్త సమస్యలను తీసుకొచ్చింది. సర్వే బాధి తులు అధికా రులు, కార్యాలయాల చుట్టూ తిరిగినా అప్పట్లో కనికరించలేదు. ఈ పరిస్థి తుల్లో కూటమి ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించాలని.. గత సర్వేలో చోటుచేసుకున్న తప్పులను సవరించాలని నిర్ణయిం చింది. ఈ క్రమంలో ఈ నెల 30వ తేదీ నుంచి రీ సర్వేకు సిద్ధమైంది. భూముల సమస్యల పరిష్కారా నికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో భూ రీసర్వేను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహణకు అధికా రులు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. గ్రామ హద్దుల నిర్ధారణకు సంబంధించిన సర్వే జరు గుతోంది. భూ ముల యజమానులకు సర్వేపై అవగాహన కల్పిం చేందుకు 25వ తేదీ నుంచి 27 వరకు గ్రామ సభ లు.. ర్యాలీలు నిర్వహిం చనున్నారు. ఇందుకు సంబం ధించి ప్రణాళి కను సర్వే శాఖ సిద్ధం చేసింది. మండ లానికి ఒక గ్రామాన్ని రీసర్వేకు ఎంపిక చేశారు. ఇందు కోసం యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది.

వైసీపీ హయాంలో గందరగోళం..

వైసీపీ హయాంలో భూముల రీసర్వే అస్తవ్య స్తంగా.. గందరగోళంగా జరిగింది. పెద్దఎత్తున తప్పులు చోటు చేసుకున్నాయి. ఒక్కో మండ లంలో ఒకేసారి ఐదారు రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేశారు. అధికారులు సిబ్బంది కొరతతో తూతూమంత్రంగా సర్వే చేయగా తప్పులు చోటుచేసుకున్నాయి. సర్వేలో వ్యత్యాసం ఉంటే యజమానిని సంప్రదించకుండా ఒకరికి ఎక్కువ ఒకరికి తక్కువగా భూమి ఎక్కిం చారు. ఫలితంగా ఎన్నడూ లేనంతగా భూ సమస్య లను రైతులు ఎదుర్కొ న్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలకు సంబం ధించి వేలాది మంది బాధితులు అర్జీలు అందజేశారు. ఈ పరిస్థితుల్లో గతంలో జరిగినట్లు పొరపాట్లకు తావులేకుండా, అత్యంత జాగ్రత్తగా రీ సర్వే నిర్వహించాలని యంత్రాంగాన్ని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో రీ సర్వేలో ఎటు వంటి లోపాలు తలెత్తకుండా పక్కా ప్రణాళికను అధికారులు సిద్ధం చేశారు. ఒక్కొక్క మండలంలో ఒక్కో గ్రామంలోనే రీ సర్వే చేయనున్నారు. రీసర్వేకు ప్రత్యేకంగా బృందాలను కూడా నియమించారు. 200 నుంచి 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా విభ జించగా ఒక్కో బ్లాక్‌కు ఒక బృం దాన్ని కేటా యించారు. ఈ బృం దంలో ఇద్దరు సర్వే యర్లు, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సహాయ కులు ఉంటారు. బృందానికి సాంకే తిక సిబ్బంది సహాయంగా ఉంటారు. పొలాల గట్లు, విస్తీర్ణం పక్కాగా కొలుస్తారు. ఎక్కడి కక్కడ ప్రజలు, భూ యాజమానుల సమక్షం లోనే సర్వే చేయనున్నారు.



గ్రామ హద్దుల సర్వేను పరిశీలిస్తున్న సర్వే శాఖ ఏడీ కీర్తి

తీరంలో సందడి చేద్దాం

» వారాంతపు రోజుల్లో పర్యాటకుల తాకిడి
» సరిపడా వసతులు కరువు
» ప్రభుత్వం దృష్టి సారిస్తే పర్యాటకాభివృద్ధికి అవకాశం



పర్యాటకుల రైడింగ్ కోసం ఏర్పాటు చేసిన కార్లు, బైక్‌లు



ఒంటె సవారీలో పర్యాటకులు



మోడల్ బైక్

చీరాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సముద్ర తీరం ప్రాంతంలో సింహభాగం చీరాల నియోజకవర్గంలో ఉంది. చీరాల మండలం వాడరేవు నుంచి వేటపాలెం మండలం పొట్టి సుబ్బయ్యపాలెం వరకు తీరంలో సందడి చేసేందుకు పర్యాటకులు పోటెత్తుతారు. ప్రధానంగా వారాంతపు రోజులైన శని, ఆది వారాల్లో తీరంలో సందడి చేద్దాం చలోచలో అంటూ వచ్చే పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆ పరిధిలో ఉన్న అన్ని రిసార్టులు, హోటల్స్ కిక్కిరిస్తాయి. ఇక విడిగా వచ్చే పర్యాకుల సంఖ్య గణనీయంగా ఉంటుంది. ఇవి సానుకూల అంశాలు. అయితే సాధారణ పర్యాటకులకు తగిన వసతులు కల్పించడంలో ఆయా గ్రామ పంచాయతీలు విఫలమవుతున్నాయనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

కార్, బైక్ రైడింగ్ క్రేజీ

తీరంలో పలు ప్రాంతాల్లో సముద్రపు ఒడ్డున తీరంలో నడిచే కార్లు, బైక్‌ల రైడింగ్‌కు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో వాడరేవు, రామాపురం, కఠారివారిపాలెం పరిధిలో సుమారు 20 కార్లు, బైక్‌లు ఉన్నాయి. వాటిపై తీరంలో రైడ్ చేసేందుకు ఆసక్తి చూపే వారి నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.100 వసూలు చేస్తారు. కారు మోడల్ అయితే ఒకరు ఉంటే రూ.100, ఇద్దరు ఉంటే రూ.200 తీసుకుంటున్నారు.

ఒంటెలపై సవారీ

తీరానికి వచ్చే పర్యాలకుల్లో పలువురు ఒంటెలపై రైడింగ్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. చిన్నపిల్లలు కూడా అందుకు ముందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో దూరాన్ని బట్టి ఒంటె యజమానులు రుసుము వసూలు చేస్తారు.

కనీస వసతులు కరవు

తీరప్రాంతంకు వచ్చే పర్యాటకుల్లో రిసార్ట్స్ హోటల్స్‌కు వచ్చే వారికి వసతులు ఉంటున్నాయి. అయితే విడిగా వచ్చే పర్యాటకులకు కనీసం మంచినీరు కూడా అందుబాటులో లేదు. అలానే దుస్తులను మార్చుకునేందుకు వసరులు లేవు. దీంతో సముద్ర స్నానం చేసిన వారు ఇబ్బంది పడుతున్నారు. ఈట్ ఫుడ్ పేరుతో విక్రయదారులకు అవకాశం కల్పిస్తే సత్ఫలితాలు వస్తాయని పర్యాటకులు భావిస్తున్నారు. అలా చేస్తే రిసార్ట్ ఆదాయం తగ్గే అవకాశం ఉంటుంది కాబట్టి ఆ వైపు యంత్రాంగం దృష్టి సారించటం లేదని పర్యాటకులు అభిప్రాయ పడుతున్నారు.

మూలనపడ్డ ప్రభుత్వ అతిథి గృహం

వాడరేవులో రూ.17లక్షల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ అతిథి గృహం మూలనపడ్డది. అది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఆ అతిథి గృహం ఎందుకు కట్టారో, ఎందుకు పాడుబెట్టారో ప్రజాప్రతినిధులు, అధికారులే చెప్పాలి. ప్రభుత్వ పరంగా వివిధ ప్రాంతాల్లో హరిత రిసార్ట్స్ పేరుతో నిర్మిస్తున్నారు. ఇక్కడ కూడా ప్రభుత్వ రిసార్ట్స్ నిర్మిస్తే ఆదాయం వస్తుంది. పర్యాటకులకు కూడా ఎంతో బాగుటుందని పర్యాటకులు భావిస్తున్నారు.

ఉపాధి పొందుతున్నాం.. సబ్సిడీ ఇస్తే బాగుంటుంది



మేము పర్యాటకులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆనందాన్ని ఇస్తున్నాం. బైక్ మోడల్ అయితే రూ.2.50లక్షలకు వాహనం వస్తుంది. కార్ మోడల్ అయితే రూ.2.75లక్షలు అవుతుంది. రైడింగ్‌కు వచ్చే వారి నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.100 చొప్పున వసూలు చేస్తాం. బైక్ మోడల్ అయితే ఒకరు, కార్ మోడల్ అయితే ఇద్దరు వెళ్లొచ్చు. అవగాహన లేకపోతే వారితో మేము వెళతాం. రోజుకు ఐదారు వందల రూపాయాలు మిగిలుతున్నాయి. అది వారం, విడి రోజుల్లో అంత ఆదరణ ఉండదు. మాకు సబ్సిడీతో రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలిని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

- సాయిబాబా, బైక్ రైడర్, రామాపురం, వేటపాలెం మండలం

అభివృద్ధి చేస్తే చీరాలకు ప్రత్యేక స్థానం



మా సొంతూరు చీరాల. నేను ఉండేది రాజమండ్రి. అక్కడ చదువుకుంటున్నాను. సెలవులకు వచ్చాను. ఆటవిడుపుగా తీరంలో సందడి చేసేందుకు కుటుంబ సభ్యులం వచ్చాం. మేం చూసిన వాటిల్లో కాకినాడ ఉప్పాడ బీచ్‌కు, కేరళలోని కొట్టాయం, వర్కలీ బీచ్‌లు అద్భుతంగా ఉన్నాయి. చీరాల తీరానికి ఎన్నో సహజ సిద్ధమైన అవకాశాలు ఉన్నాయి. స్పీడ్ బోటింగ్, పారాగ్లైడింగ్‌తో పాటు ఈట్ ఫుట్ సెంటర్లు, షాపింగ్ దుకాణాలకు అవకాశాలు కల్పించి, నిర్వహిస్తే పర్యాటకుల సంఖ్య ఇంకా పెరుగుతుంది. ఆదిశగా అభివృద్ధి చేస్తే చీరాలకు ప్రత్యేక స్థానం లభిస్తుంది.

- హిమ శ్రీదుర్గ, పర్యాటకురాలు, రాజమండ్రి

మంచి అనుభూతి.. మరింత అభివృద్ధి చేయొచ్చు



నేను హైదరాబాద్ నుంచి వచ్చాను. బీచ్ అందాలు, వాతావరణం బాగుంది. కార్ రైడింగ్ మంచి అనుభూతిని ఇచ్చింది. ఇక్కడ చిలక జోస్యం చెప్పించుకుని మంచి అనుభూతి పొందాం. అయితే పర్యాటకులకు సౌలభ్యం, ఆనందం కోసం ఇక్కడ మరింత వనరులు సమకూర్చేందుకు మంచి అవకాశాలు ఉన్నాయి. అలా తీర్చిదిద్దితే ఇంకా బాగుంటుంది.

- వికాస్, పర్యాటకుడు, హైదరాబాద్

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

పెమ్మసానికి కొండయ్య విజ్ఞప్తి



కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మం త్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఆదివారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి భాగంగా రోడ్లు, డ్రైన్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

నేటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

బల్లికురవ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమను వృద్ధిలోకి తెచ్చేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు అన్ని గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని పశు వైద్యాధికారి మహేశ్వరరావు తెలిపారు. 20న వెలమవారిపాలెం, కొత్తూరు, 21న కూకట్లపల్లి, గొర్రెపాడు, 22న కొప్పెరపాడు, ఎస్ఎల్ గుడిపాడు, 23న వైదన, కొమ్మినేనివారిపాలెం, 24న వల్లాపల్లి, అంబడిపూడి, 25న బల్లికురవ, గుంటుపల్లి, 27న ముక్తేశ్వరం, చెన్నుపల్లి, 28న కొప్పెరపాలెం, మల్లాయపాలెం, 29న కొణిదెన, నక్కబొక్కలపాడు, 30న వేమవరం, కె.రాజుపాలెం, 31న ఉప్పుమాగులూరు గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని, పశువులకు నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, కృత్రిమ గర్భధారణ, చూడి పరీక్షలు చేస్తామన్నారు. పశు పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియెగం చేసుకోవాలని వైద్యాధికారి మహేశ్వరరావు కోరారు.

మహిళల ఇష్టం మేరకే గేదెల కొనుగోలు

బల్లికురవ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాలకు చెందిన మహిళలు ఇష్టపడితేనే గేదెలను కొనుగోలు చేయవచ్చని వెలుగు ఏపీఎం రాజారావు ఆదివారం తెలిపారు. శనివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన పొరుగు జిల్లాల గేదెలు మాకొద్దు అన్న కథనంపై వెలుగు అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలకు రుణాలు అందిస్తున్నామని, మంజూరైన రుణంతో వారికి ఇష్టం అయితేనే పశ్చిమ గోదావరి జిల్లాలో గేదెలు కొనుగోలు చేయవచ్చని వారికి గేదెలు నచ్చక పోతే కొనుగోలు చేయాల్సిన అవసరం లేదన్నారు. బలవంతంగా గేదెలు కొనుగోలు చేయాలని ఎవరైనా సిబ్బంది మహిళలపై ఒత్తిడి తెస్తే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. మహిళలు తమ గ్రామాలలోనే గేదెలు కొనుగోలు చేస్తామని చెబితే ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అయన తెలిపారు.

ఆ పాత్రలతో ఎప్పటికీ గుర్తుంటారు

అద్దంకిటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : సినిమాల్లో వారి పాత్రలను రక్తికట్టించి అందరి మనస్సులలో ప్రతిభమూర్తులుగా ఎప్పటికీ గుర్తుంటారని వక్తలు కొనియాడారు. ఆదివారం ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిన్ని శాంతయ్య సేవా సదన్‌లో ప్రతిభమూర్తులు - మధురస్మృతులు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ కళా వేదిక పేరు పెట్టి సభ్యులు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్, సినీ నటుడు కైకాల సత్యనారాయణ, రేనాటి వీరుడు వడ్డె ఓబన్న చిత్రపటాలకు సభ్యులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతిభామూర్తులైన ఎన్టీఆర్ సినీ జీవిత విషయాలను గురించి జనచైతన్య వేదిక కన్వీనర్ అన్నమనేని వెంకట్రావు, సినీ నటులు కైకాల సత్యనారాయణ సినీ జీవిత విశేషాలను, పలు సినిమాలల్లో ఆ యా ప్రాతల ద్వారా వచ్చిన గుర్తింపు విషయాలను వారణాసి రఘురామశర్మ సభలో వివరించారు. కార్యక్రమానికి కోనేటి అనిల్ కుమార్ ఆర్థిక సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో అసోసియేష్ సభ్యులు పిసిహెచ్ వీ రయ్య, చిన్నా, బ్రాహ్మం, నాగేశ్వరరావు తోపాటు అళహరి హరిప్రసాద్, వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), దేవపాలన, దివాకర్‌దత్తు, చిన్ని మురళీకృష్ణ, మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, రాఘవరావు, చంద్రమౌళి, భువనేశ్వరి, శ్రీరామచంద్రమూర్తి, వీరయ్య పాల్గొన్నారు.



ప్రతిభమూర్తుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సభ్యులు

తీరంలో అనుమతిలేని నిర్మాణం తొలగింపు



వాడరేవులో పోలీస్ బందోబస్తు మధ్య అనుమతులులేని నిర్మాణాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న సిబ్బంది



అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణం (ఫైల్)

చీరాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం వాడరేవు తీరంలో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణ పనులపై కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు ఆయన ఆదేశాలతో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ఇతర అధికారుల బృందం గత శుక్రవారం ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ నేపథ్యంలో సీఆర్‌జడ్ నిబంధనల ఉల్లంఘనపై శనివారం ఆంధ్రజ్యోతిలో కన్నెర్ర చేస్తారా .. కట్టడి చేస్తారా అన్న శీర్షికతో ప్రచురితమైన కథనంపై అధికార యంత్రాంగం వెంటనే స్పందించింది. ఆదివారం ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, డీఎస్పీ మహ్మద్‌మొయిన్, రూరల్ సీఐ శేషగిరిరావు, పలువురు ఎస్సైలు, సుమారు 30 మంది కానిస్టేబుళ్ల బందోబస్తు మధ్య అనుమతులు లేకుండా చేపట్టిన ఓ నిర్మాణానికి సంబంధించిన బేస్‌మెంట్‌లను, పిల్లర్లను ఎక్స్‌వేటర్‌తో తొలగించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడుతూ సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించడం, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. మిగిలిన అనధికార నిర్మాణాలపైన తగిన చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

అజాద్‌ని పరామర్శించిన ఎమ్మెల్యే ఏలూరి



అజాద్‌ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

చినగంజాం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామానికి చెందిన టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ కలాం అజాద్‌ని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదివారం పరామర్శించారు. అజాద్ సతీమణి ఖాజున్నీసా బీబీ శుక్రవారం మృతి చెందడడంతో ఎమ్మెల్యే ఏలూరి అజాద్ స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో ఏలూరి సమావేశం నిర్వహించి, మాట్లాడారు. పెదగంజాం పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం, చినగంజాం, కడవకుదురు, కొత్తపాలెం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు పలు సమస్యలను ఆయ న దృష్టికి తెచ్చారు. పల్లెపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారులు బాపట్ల ఎఫ్‌డీవో చీరాల ఇన్‌చార్జి ఎఫ్‌డీవోగా ఉన్నారని, ఆయన వలన పలు సమస్యలు త్వరగా పరిష్కారం కావడం లేదని, ఆ స్థానంలో మరో అధికారిని నియమించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఏలూరి సమస్యలను పరిశీలించి ఫోన్‌లో అధికారులతో మాట్లాడారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని భాగ్యనగర్‌కు చెందిన మత్స్యకారుడు కర్రి ధనరాజ్ తనకు బోటు ఇప్పించాలని ఏలూరిని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పొద వీరయ్య, ఇంకొల్లు మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, చినగంజాం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు రాయని ఆత్మారావు, చెరుకూరి రాఘవయ్య, నాయకులు టీ.జయరావు, ఆసోది సుబ్బారెడ్డి, కోకి భాస్కర రెడ్డి, నరహరి శ్రీనివాసరావు, పర్వతరెడ్డి పార్థసారిథి, షేక్ జిలాని, వాటుపల్లి ఏడుకొండలు, డి.తిరుపతిరావు, జి.నరసింహారావు, పెదగంజాం సర్పంచ్ నక్కల కృష్ణ, పలు గ్రామాలనాయకులు పాల్గొన్నారు.

కారంచేడు మండలంలో విస్తృత పర్యటన

కారంచేడు : కారంచేడు మండలంలో ఎమ్మెల్యే ఏలూరి ఆదివారం విస్తృతంగా పర్యటించారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న స్వర్ణగ్రామానికి చెందిన బండారు సిరాబందిని పరామర్శించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన తిమిడిదపాడు గ్రామానికి చెందిన బోడావుల బలరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే గ్రామానికి చెందిన భాస్కరరావు మృతి చెందగా, అయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం తిమిడితపాడు గ్రామ వాసుల నుండి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండలపార్టీ అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీహరి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

అద్దంకిటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన శింగరకొండవద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ ఆదివారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ జాబ్‌మేళాకు అరబిందో ఫార్మా, రవిలీలా గ్రినేటస్, ఇలలాగిరి డేన్ సొల్యూషన్ కంపెనీలు హాజరు అవుతాయని, 100కిపైగా ఖాళీలు ఉన్నాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లమో, బీఎస్సీ, ఎంఎస్‌సీ (కెమిస్ట్రీ), ఎంబీఏ, పీజీ విభాగాలు వరకు చదువుకున్న 18 నుంచి 30 సంవత్సరాల గల యువతీయువకులు వారి బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫొటోతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 8008986256, టోల్‌ఫ్రీ నెంబరు 9988853335కు సంప్రదించాలని తెలిపారు.

అమ్మవారికి హారం బహూకరణ



హారాన్ని ఈవో శ్రీనివాసరావుకు అందజేస్తున్న దాతలు

వేటపాలెం(చీరాల), జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామన్నపేట పంచాయతీ పరిధిలో ఉన్న కనక నాగవరపమ్మ అమ్మవారికి హస్తినాపురం వాస్తవ్యులు సిరిపురపు నాగశివకుమార్, గీతాదేవి దంపతులు ఆదివారం బంగారపు హారాన్ని బహూకరించారు. 37 గ్రాముల బంగారం (విలువ రూ.2,72,465) హారాన్ని అమ్మవారి కోసం ఆయల ఈవో పోతిని శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల కొంగుబంగారంగా కొలువై ఉన్న కనక నాగవరపు అమ్మవారికి హారాన్ని అందించే అవకాశం తమకు రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ అలయ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, ఆయల సిబ్బంది పాల్గొన్నారు.



మెటీరియల్ తరలింపును అడ్డుకుంటున్న బాధితులు

అప్పులిచ్చిన వారు మళ్లీ ఆందోళన

» డబ్బులు చెల్లించకుండా తిరుగుబాటు చేస్తున్న సిమెంట్ దుకాణం యజమాని
» న్యాయం చేయాలని విజ్ఞప్తి

బల్లికురవ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పెరపాడులో ఆదివారం సిమెంట్ దుకాణం వద్ద హైడ్రామా జరిగింది. అదే గ్రామానికి చెందిన మహిళ గ్రామంలో సిమెంట్ దుకాణం నిర్వహిస్తు గ్రామానికి చెందిన సుమారు 30 మంది వద్ద రూ.కోటి వరకు అప్పులు తీసుకుంది. తీసుకున్న అప్పు చెల్లించాలని కొంత కాలం నుంచి బాధితులు దుకాణ యజమాని వద్దకు వచ్చి అడుగుతున్నా అమె డబ్బులు ఇవ్వకుండా వారిపై తిరుగుబాటు చేస్తున్నారు. రెండునెలల కిందట కూడా దుకాణం నుంచి అమ్మకాలు చేసి మెటీరియల్‌ను తరలిస్తుండగా అప్పులు ఇచ్చిన వారు ఒక్క సారిగా వచ్చి అక్క ఆందోళనకు దిగారు. అప్పట్లో పోలీసు స్టేషన్‌కు పంచాయతీ చేరింది. అప్పులు ఇచ్చిన వారికి కొంత చెల్లించేలా ఒప్పందం కుదిరింది. అప్పటి వరకు దుకాణంలో ఉన్న సరుకు అమ్మకాలు చేయవద్దని ఒప్పందం జరిగింది. ఆదివారం ఇనుము, సిమెంట్‌ను అద్దంకి వైపు తరలించేందుకు ట్రాక్టర్‌కు ఎక్కించారు. విషయం తెలిసి అప్పులిచ్చిన వారు ఆందోళనకు దిగారు. తమకు డబ్బులు ఇచ్చి మీ సరుకు అమ్మకాలు చేయాలని ట్రాక్టర్ పోనివ్వకుండా అడ్డుకున్నారు. దుకాణ యజమాని తిరుగుబాటుపై అధికారులు దృష్టిసారించాలని, తమకు డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని అప్పులిచ్చినవారు వాపోతున్నారు.

దూడల జననానికి అందుబాటులో వ్యాక్సిన్

పశు వైద్యాధికారి డాక్టర్ సరిత

పంగులూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : పాడి పశువుల సంతతి పెంచడం, తద్వారా ప్రజల అవసరాలకు సరిపడా పాల దిగుబడులు పెంపొందించాలనే సంకల్పంతో ప్రభుత్వం పశు సంవర్థక శాఖ ద్వారా చర్యలు చేపడుతున్నట్లు పశు వైద్యాధికారి పి.సరిత అన్నారు. ఎదకు వచ్చిన గేదెలకు నిర్ణీత వ్యవధిలో వ్యాక్సిన్ వేయడం ద్వారా సూడి మోసిన గేదెలు పడ్డ దూడలకు జన్మనిచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సరిత తెలిపారు. ఎద సమయంలో సూడి మోసేందుకు రెండు విడతలుగా వ్యాక్సిన్ ఇస్తామని, దీనికోసం రైతులు రూ.500 చెల్లించాలన్నారు. ఈత సమయంలో దూడ పుడితే గేదె యజమానికి వారు చెల్లించిన నగదు తిరిగి చెల్లిస్తారన్నారు. ఈ వ్యాక్సినేషన్ వినియోగించిన గేదెలకు 80 శాతం పడ్డ దూడలు పుడుతున్నట్లు తెలిపారు. పడ్డ దూడల సంతతి పెంచడం ద్వారా పాల దిగుబడులను పెరుగుతాయనే ఉద్దేశంతో పశు సంవర్థక శాఖ వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చిందని డాక్టర్ సరిత తెలిపారు.

అమిత్ షా తీరు హేయం

చీరాలటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం మంత్రి అమిత్ షా మనువాద భావాజాలంతో వ్యవహరిస్తున్న తీరు హేయమని పలువురు వామక్ష, దళిత సంఘాల నాయకులు అన్నారు. అమిత్ షా రాష్ట్ర పర్యటను వ్యతిరేకిస్తూ ఆదివారం పట్టణంలో నిరసన ప్రదర్శన చేశారు. అంబేడ్కర్‌ను అవమాన పరిచేలా మాట్లాడడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నారపరెడ్డి, బీసీ ఫెడరేషన్ నాయకులు వెంకటేశ్వర్లు, దళిత బహుజన పార్టీ జిలానీ, బలహీన వర్గాల సమాఖ్య సామ్యేల్. పవన్, విమలాకర్, సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాలపై దృష్టి సారించాలి



బ్యాగులు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో లక్ష్యాలపై దృష్టి సారించడం వలన ఉన్నతంగా రాణిస్తారని ఆర్సీఎం చర్చి ఫాదర్ నరేష్‌బాబు అన్నారు. పట్టణంలోని మార్పు సామాజిక సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం నుంచి 40 రోజులపాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ఫాదర్ ప్రారంభించారు. ఈసందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. పోటీ పరీక్షలు, శిక్షణ తరగతులలో ఉత్సాహంగా పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గ్రిగోరీ, డేవిడ్, పలువురు వక్తలు పాల్గొన్నారు.

యువతి బలవన్మరణం

చీరాలటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యం తాళలేక యువతి (20) బలవన్మరణం చెందింది. ఈఘటన చీరాల పరిధిలోని సాల్మన్ సెంటర్‌లో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణంలో డిగ్రీ సెకెండియర్ చదువుతున్న ఆ యువతి గతేడాదిలో రోడ్డు ప్రమాదంలో గాయపడింది. ఈక్రమంలో అప్పుడప్పుడూ సంబంధిత సమస్యలతో వేదన పడుతోంది. ఈ క్రమంలో ఇంట్లోనే ఉరివేసుకొని మృతి చెందింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అలాగే ఆదివారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వాహనంలో మంటలు

తగులబడిన మినుముల బస్తాలు



వాహనంలో కాలిపోతున్న మినుముల బస్తాలు

మార్టూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు వైపు రోడ్ రాజుపాలెం, తాతపూడి గ్రామాల మధ్య శనివారం అర్ధరాత్రి వాహనంలో అగ్ని ప్రమాదం జరిగింది. నెల్లూరు నుంచి చిలకలూరిపేటకు మినుములు బస్తాలతో వెళుతున్న వాహనం క్యాబిన్‌లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దాంతో ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ కిం దికి దిగిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ప్రమాదంలో కొన్ని మినుముల బస్తాలు కాలిపోయాయి. చిలకలూరిపేట నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేయడంతో కొన్ని మినుముల బస్తాలు కాలిపోకుండా మిగిలాయి. సీఐ ఎం.శేషగిరిరావు వెళ్లి పరిశీలించారు.

ప్రధాన మురుగు కాల్వలో పూడిక తీత

ఇంకొల్లు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు పంచాయతీ పరిధిలోని కడవకుదురు రోడ్డులోని మురుగు కాల్వలో ఆదివారం పూడిక తీత పనులు చేపట్టారు. ఒకటో మైలురాయి వరకు ఎక్స్‌కవేటర్‌తో పూడికను తొలగించి, మురుగునీరు పారేలా చర్యలు చేపట్టారు. ఇంకొల్లులో ఆరు ప్రధాన మురుగు కాల్వలు ఉండగా మిగిలిన కాల్వల్లో పూడికను తొలగిస్తామని కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు.

పక్షుల పండుగ రెండవరోజు ఆదివారం అదరహో అనిపించింది.. సూళ్లూరుపేట కళాశాల మైదానప్రాంతాలు, నేలపట్టు పక్షుల రక్షితకేంద్రం, భీములవారిపాళెం పడవలరేవు, అటకానితిప్ప ప్రాంతాలకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. ఇక సూళ్లూరుపేట కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను చూసేందుకు కూడా జనం పోటీపడ్డారు. ఉద్యానవనశాఖ, షార్ కేంద్రం ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో జనం సందడి కన్పించింది. బీవీపాళెం పడవలరేవు, అటకానితిప్పల్లో ఏర్పాటు చేసిన వేదికల వద్ద నృత్య ప్రదర్శనలు పర్యాటకులను ఆకట్టుకున్నాయి. బంగారు చీరలో ఉన్న సూళ్లూరుపేట చెంగాళమ్మను దర్శించుకునేందుకు బారులు తీరారు.

- సూళ్లూరుపేట/తడ, (ఆంధ్రజ్యోతి)



బీవీపాళెం ఓడ రేవు వద్ద బోటు షికారు కోసం వచ్చిన సందర్శకులు

- పోటెత్తిన జనం
- పడవ షికారుకు ఉత్సాహం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- భారీ వర్షంతో ఇక్కట్లు

పక్షుల పండుగ అదరహో!

వానతో అవస్థలు

శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు వాన కురిసింది. దీంతో కళాశాల మైదానంలో నీళ్లు నిలబడిపోయాయి. ఆ ప్రాంతం బురదగా మారడంతో నీళ్లను మోటార్లు పెట్టి బయటకు తోడేందుకు శ్రమించాల్సివచ్చింది. బీములవారిపాళెం పడవలరేవు వద్ద కూడా వానకు చిత్తడిగా మారిపోవడంతో అక్కడ సైతం జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జోరుగా హుషారుగా పడవ షికారు

భీములవారిపాళెం వద్ద ఏర్పాటు చేసినపడవ షికారుకు జనం ఎగబడ్డారు. వానజల్లు ఉన్నా ఉదయం నుంచే జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. భద్రత రీత్యా ఒక్కో పడవలో 10 మందికి మించి జనాన్ని ఎక్కించకపోవడంతో పడవ షికారుకు గంటపాటు ఎదురుచూసే పరిస్థితి నెలకొంది.

వచ్చే ఏడాది మరింత ఘనంగా పండుగ : జేసీ

దొరవారిసత్రం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది కూడా ఇదే నెలలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిస్తామని తిరుపతి జిల్లా జేసీ శుభం బన్సల్ తెలిపారు. పక్షుల పండుగ నిర్వహణపై అనుభవం ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మరింత ఘనంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆదివారం నేలపట్టు పక్షుల కేంద్రంలో పర్యటించిన ఆయన తహసీల్దారు శైలాకుమారి, ఎఫ్ఆర్‌వో సౌజన్యలతో ఏర్పాట్లపై చర్చించారు. తిరుమల ఘటనతో ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లల్లో కొంత జాప్యం జరిగిందని, ఈ ఏడాది లోటుపాట్లను గుర్తించి, వచ్చే ఏడాదికి ముందుగానే సిద్ధం అవుతామని మీడియాకు వివరించారు.

రెండు గంటలు అవస్థలు

దొరవారిసత్రం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల కేంద్రంలో ట్రాఫిక్ అంతరాయంతో సందర్శకులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఆదివారం సెలవు దినం కావడంతో పెద్ద సంఖ్యలో కార్లలో వచ్చారు. దొరవారిసత్రం నుండి పక్షుల కేంద్రం ప్రధాన గేటు వరకు మధ్యాహ్నం సమయంలో రెండు గంటల పాటు వాహనాలు ఆగిపోయాయి. హైవే వంతెన, రైల్వే వంతెనల వద్ద వాహనాలు ఇరుక్కుపోయాయి. దాంతో నేలపట్టు ఆర్ అండ్‌బి రోడ్డుపై కూడ వాహనాలు బారులు తీరి కదలకుండా నిలబడిపోయాయి. పోలీసులు జోక్యం చేసికుని పరిస్థితిని చక్కదిద్దారు.

పక్షులతో పోటీపడి...

దొరవారిసత్రం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ రెండవ రోజు నేలపట్టు సందర్శకుల రద్దీతో సందడిగా కనిపించింది. చెరువులోని కడపచెట్లమీద పక్షులతో పోటీపడి చెరువు కట్టమీద సందర్శకులు కిటకిటలాడారు. ఉదయం చిరు జల్లుల వల్ల జనం పలుచగా కనిపించినా 11 తర్వాత వెల్లువలా వచ్చారు. పక్షుల కేంద్రంలోని అన్నీ రోడ్లు జనంతో నిండి పోయాయి. సెలవురోజు కావడంతో చెన్నై నుంచి ఉద్యోగుల కుటుంబాలు పెద్ద సంఖ్యలో వచ్చాయి. అలాగే శ్రీసిటీ, మేనకూరు, మాంబట్టు సెజ్‌ల్లోని పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు కూడా భారీగానే వచ్చారు. నెల్లూరు, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, సత్యవేడు, వరదయ్యపాళెం, ఆరంబాకం, గుమ్మిడిపూడి ప్రాంతాల నుండి సందర్శకులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆదివారం ఒక్కరోజే దాదాపు 10 వేలమంది నేలపట్టును సందర్శించినట్లు అంచనా.

హైలెస్సో.. హైలెస్సా

వరదయ్యపాళెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తడ మండలం భీములవారిపాలెం ఓడ రేవు నుంచి రెండో రోజూ సందర్శకులు పడవ షికారు చేశారు. 1.55 కిలోమీటర్ల మేర పడవ షికారు చేశారు. ఇక, కలెక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కూడా బోటు షికారు చేశారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులు ఎంతో మానసికోల్లాసంతో గడుపుతారన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న యాంకర్ అనసూయ



సూళ్లూరుపేటలో ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద జన సందోహం

పర్యావరణం.. అభివృద్ధి

'పులికాట్ సరస్సుకు పర్యావరణం అతి ముఖ్యమైన అంశం. పక్షులు పెద్ద ఎత్తున వస్తాయి. అదే సమయంలో అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఎన్నో దేశాల నుంచి వచ్చే పక్షులను కాపాడుకుంటేనే ఇలాంటి పండుగలు జరుపుకోగలం'

- కలెక్టర్ వెంకటేశ్వర్

నేటి నుంచి కుష్ఠు వ్యాధిపై సర్వే

- ఫిబ్రవరి 2 వరకు నిర్వహణ
- జిల్లాలో 1,875 బృందాల ఏర్పాటు

నెల్లూరు (వైద్యం) జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు సోమవారం (నేటి) నుంచి ప్రత్యేక సర్వే నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 2 వరకు ఈ సర్వే జరుగుతుంది. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ ఇంటింటికి తిరిగి ఎవరైనా వ్యాధిగ్రస్థులు ఉన్నారా.. ఉంటే వారు ఎలాంటి చికిత్స పొందుతున్నారు.. అసలు చికిత్స చేయించుకుంటున్నారా.. లేదా...? అనే వివరాలు సేకరించనున్నారు. ఒంటిపై రెండుకిమించి మచ్చలు ఉన్నట్లయితే... కుష్ఠువ్యాధిగా అనుమానించి స్థానిక పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయి పరీక్షలు చేసేలా విధానాలు రూపొందించారు. అంతేకాక వారి వివరాలు నమోదు చేసుకుని, ప్రత్యేక చికిత్స చేయించుకునేలా చేయూత నిస్తారు. ఇందుకుగాను కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు జిల్లాలో 1,034 మంది కుష్ఠు వ్యాధిగ్రస్థులు ఉన్నారు. వారికి అన్ని విధాలా చికిత్స అందిస్తున్నారు. మొత్తం వ్యాధిగ్రస్థుల్లో 490 మంది దివ్యాంగులు ఉన్నట్లు అధికారులు నిర్ధారించి పింఛను అందిస్తున్నారు. అలాగే వారికి వాకర్లు, ఊతకర్రలు అందిస్తున్నారు. అవసరమైనవారికి శస్త్రచికిత్సలు కూడా అందిస్తున్నారు. గత ఏడాది కాలంలో 30 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించారు.జిల్లాలో ఇంటింటి సర్వేలో 1,875 బృందాలు పాల్గొంటున్నాయి. ఒక్కో బృందంలో ఏఎన్ఎంతో పాటు ఆశా కార్యకర్త ఉంటారు. సర్వేపై పీహెచ్‌సీ వైద్యుల పర్యవేక్షణ ఉంటుంది. ఈ సర్వేలో కొత్త కేసులను గుర్తించటమే కాకుండా కుష్ఠువ్యాధిపై అవగాహన కలిగించనున్నారు.

సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ తొలగింపు


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

సంగం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు వివాదాల జోలికి వెళ్లకుండా సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ తొలగిస్తామని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం ఆయన సంగం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌పేట, చేజర్ల, సంగం మూడు మండలాల సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రౌడీషీటర్ల గత కేసుల వివరాలు, ప్రస్తుతం వారి ప్రవర్తన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సీఐ వేమారెడ్డి, మూడు మండలాల ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు పాల్గొన్నారు.

గాడితప్పిన దేశ ఆర్థిక వ్యవస్థ

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామ్‌భూపాల్


సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామ్‌భూపాల్

ఆత్మకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారుల కబంధ హస్తాల్లో చిక్కుకుని దేశ ఆర్థిక వ్యవస్థ గాడితప్పిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీ రామ్‌భూపాల్ అన్నారు. స్థానిక నేతాజీ క్లబ్‌లో ఆదివారం పెట్టు బడి - ప్రజాస్వామ్యం అనే అంశంపై సీపీఎం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రజాస్వామ్యంపై ప్రభావం చూపుతోందని, ప్రభుత్వాలు ఇప్పటికైన మేల్కొనకపోతే దేశంపై పెనుప్రభావం చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, జిల్లా కౌలురైతు సంఘం జిల్లా నాయకుడు జి లక్ష్మీపతి, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు మూలి వెంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు అన్వర్‌బాషా, రైతు సంఘం నాయకులు లక్కు ప్రసాద్, సిఐటియు నాయకుడు జి శివప్రసాద్, సీపీఎం, సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

23న వరికుంటపాడు మండల సర్వసభ్య సమావేశం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 23వ తేదీన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాల్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశంలో శాఖలవారీగా అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించడంతో పాటు పారిశుధ్యం, సీజనల్ వ్యాధులు, తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఐటా కార్యవర్గం ఎన్నిక


ఎంపికైన ఐటా కార్యవర్గం సభ్యులు

ఉదయగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక జమాతే ఇస్లామీ హింద్ కార్యాలయంలో ఆల్ ఇండియా ఐడల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) ఉదయగిరి నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఫయాజ్, లియాఖత్‌అలీ, ఉపాధ్యక్షుడిగా రఫీ, ఖలీల్, జాయింట్ కార్యదర్శులుగా నాయబ్‌రసూల్, మసూద్, మదరసా కార్యదర్శిగా సయ్యద్ అఫ్రోజ్, కోశాధికారిగా నస్రుల్లా, గౌరవాధ్యక్షులుగా ఇస్మాయిల్‌సాహెబ్, ముఖ్య సలహాదారునిగా ఎస్ మున్నాలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎన్నికల పరిశీలకులుగా ఐటా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్‌రజాక్, మాజీ జాతీయ కార్యదర్శి షాకీర్‌హుస్సేన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మకు నెల పొంగళ్లు

వింజమూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గంగమిట్ట దగ్గర వున్న శ్రీగంగాభవానీ దేవస్థానంలో ఆదివారం గంగమ్మ తల్లికి నెల పొంగళ్లు నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

పాలలక్ష్మమ్మకు విశేష పూజలు

ఉదయగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నవారిచింతల గ్రామ మామిడితోపులో ఉన్న శ్రీడిల్లీ పాలలక్ష్మమ్మ అమ్మవారికి ఆదివారం కొల్లిబోయిన వంశస్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి గణపతి పూజ, పున్యహవచనం, నవగ్రహ మండపారాధన, పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజ, ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పల్లకిసేవ నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బాధితుడికి ఆర్థిక సహాయం


బాధితుడికి నగదు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న వరికుంటపాడుకు చెందిన సంచిబోయిన మాల్యాద్రికి ఆదివారం మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. విషయం తెలుసుకున్న అధ్యక్ష, కార్యదర్శులు ఎం ముసలయ్య, ఎన్ బాబురావు బాధితుని నివాసానికి వెళ్లి తమవంతు చేయూతగా రూ. 5వేలు నగదు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ వీ వెంకటేశ్వరారావు, మాజీ అధ్యక్షుడు పీ తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచు మట్టె హరినారాయణ, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టాభిని కలిసిన నేతలు

కందుకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కందుకూరులోని పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టాభిని ఆదివారం పార్టీ నియోజకవర్గ నేతలు దామా మల్లేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వెంట స్థానిక నేతలు వడ్లమూడి సురేష్, పొడపాటి నాగేశ్వరరావు, ఉన్నం వీరాస్వామి, భవనాసి వెంకటేశ్వర్లు, మురారిశెట్టి సుధీర్, కోట కిషోర్ ఉన్నారు.

నేటి నుంచి ఉచిత పశువైద్య శిబిరాలు

కందుకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల్లో సోమవారం నుంచి 31వరకు ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్. సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరంలో గేదెలు, దూడలకు డీవార్మింగ్ మందులు, గొర్రెలు, మేకలలో నట్టల నివారణ మందులు, బొబ్బరోగం రాకుండా ముందస్తు టీకాలు వేస్తామని, పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

ఉదయగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళరావునగర్ గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ముత్యాలపాటి అబ్దుల్‌ఖాదర్ జ్ఞాపకార్థం నిర్వహించిన మెగా క్రికెట్ పోటీల్లో విజేతలకు ఆదివారం నిర్వాహకుడు హనీఫ్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో వెంగళరావునగర్ జట్టు ప్రథమ, ఉదయగిరి మెకానికల్ రాయల్ జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. వారికి నిర్వాహకులు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేల చొప్పున నగదు బహుమతి, ట్రోఫీలను అందజేశారు. అలాగే ఆటలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు అబ్దుల్, మహ్మద్‌ఖాజా, గ్రామపెద్దలు షేక్ రియాజ్, షరీఫ్, గుంటుపల్లి ఖాదర్‌బాషా, ముస్తఫా, గౌస్‌మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ పోటీల్లో ప్రథమ విజేతకు బహుమతి అందజేస్తున్న హనీఫ్

వేతనాలు అందక పారిశుధ్య కార్మికుల అవస్థలు


వైద్యశాలలో డస్టబిన్‌లు శుభ్రంచేస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఉదయగిరి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఎనిమిది మంది పారిశుధ్య కార్మికులకు గత ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బకాయిలు పేరుకుపోవడంతో కూరగాయలు, కిరాణ దుకాణాల్లో సైతం అప్పులు ఇవ్వక పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందన్నారు. తమకు నెలకు రూ.16 వేలు వేతనానికిగాను రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. అందులో పీఎఫ్, ఈఎస్‌ఐలు నగదు సైతం గత మూడేళ్లుగా ఇవ్వడంలేదన్నారు. పస్తులుంటూ విధులకు హాజరు కావాల్సి వస్తోందని కన్నీటిపర్యంతమయ్యారు. వైద్యశాలలో పారిశుధ్యం పనులతోపాటు రోగులను ఒక వార్డు నుంచి మరో వార్డుకు తరలించడం, స్టోర్ నుంచి మందులు తీసుకురావడం, క్షతగాత్రులకు డ్రస్సింగ్ చేయడం తదితర పనులు సైతం అదనంగా చేస్తున్నామని, వైద్యశాలలో తమ పనితో పాటు ఇతరత్రా పనులు చేస్తున్నా సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. వేతనాలు సకాలంలో చెల్లించాలని పాలకులు, అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని, ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని వారు వేడుకొంటున్నారు.

కుటుంబ పోషణ భారమైంది..

-రత్తమ్మ, పారిశుధ్య కార్మికురాలు



ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారమైంది. పీఎఫ్, ఈఎస్‌ఐల బకాయిలు సైతం గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు చెల్లించాల్సి ఉంది.

పస్తులుండాల్సి వస్తోంది...

-నారాయణ, పారిశుధ్య కార్మికుడు



ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంమంతా పస్తులుండాల్సి వస్తోంది. కూరగాయలు, కిరాణా దుకాణాల్లో అప్పు పెరిగిపోవడంతో వారు సరుకులు ఇవ్వడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలి.

యోగి వేమన పద్యాలు ప్రజలకు స్ఫూర్తిదాయకం


ఉదయగిరి: యోగివేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

ఆత్మకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి, సంఘసంస్కర్త యోగి వేమన జయంతి వేడుకలను ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సి శ్రీనివాసులు మాట్లాడుతూ అచ్చ తెలుగు పదాలతో తెలుగుజాతి కీర్తిని చాటిన కవి వేమన అని, ఆయన పద్యాలు ఈనాటికీ ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డి డేవిడ్, కె శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

●ఉదయగిరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం యోగివేమన జయంతిని పురస్కరించుకొని ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపర్చిన అభ్యుదయవాది, ప్రజాకవి, సంఘసంస్కర్త యోగివేమన అని పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరాజు, సీనియర్ అసిస్టెంట్ ఖాజానవాజ్, డీఈవో ఇమ్రాన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ షరీఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి


కందుకూరు: మహసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

కందుకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నెల్లూరులో జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు ముప్పరాజు కోటయ్య కోరారు. ఆదివారం ఆయన స్థానిక సీపీఎం కార్యాలయంలో రాష్ట్ర మహాసభల గోడపత్రిక ఆవిష్కరించారు. మహాసభల ముగింపు సందర్భంగా 3న సాయంత్రం ఆత్మకూరు బస్టాండ్ వద్ద నుంచి భారీ ప్రదర్శన అనంతరం వీఆర్ హైస్కూల్ గ్రౌండ్‌లో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ సభకు కేంద్ర కమిటీ నాయకులు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో ఎస్‌ఏ గౌస్, మున్వర్‌సుల్తానా, నాదెండ్ల కోటేశ్వరరావు, మల్లికార్జున, మల్లిక, పద్మ, పవన్‌కుమార్, డీఎం రాయుడు పాల్గొన్నారు.

●బిట్రగుంట: ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా సీపీఐ (ఎం) పనిచేస్తుందని పార్టీ సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి తెలిపారు. బోగోలు పార్టీ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర మహా సభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో కావలి ప్రాంతీయ కమిటీ సభ్యులు గడ్డం మాల్యాద్రి, తుమ్మల వెంకయ్య, సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు చల్లా నరహరి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పోట్లూరి శ్రీనివాసులు ఉన్నారు.

●ఉలవపాడు : మండల కేంద్రంలో ఆదివారం సీపీఎం రాష్ట్ర మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సీఐటీయూ మండల నాయకులు మాదాల రమణయ్య, ఎస్‌డీ గౌస్‌బాషా ఆవిష్కరించారు. అనంతరం వరిగిచేను ఎస్టీ సంఘంలో సీఐటీయూ ప్రాంతీయ పార్టీ సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఎం అనేక సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీ జహీర్, కత్తి సుజాత, దార్ల మాధవరావు, వై.సరళ తదితరులు పాల్గొన్నారు.

పెదపవనిలో పోలీస్ పికెట్


పెదపవనిలో పీర్లచావిడి స్థలం వద్ద పికెట్ నిర్వహిస్తున్న పోలీసులు

లింగసముద్రం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పెదపవనిలోని వివాదాస్పద పీర్లచావిడి స్థలం వద్ద ఆదివారం పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. ఈ స్థలం వద్ద రెండురోజులుగా రెండువర్గాల ప్రజలు ఘర్షణ దిగిన జరిగిన విషయం తెలిసిందే. రెవెన్యూ అధికారులు గ్రామ సర్వే నంబరు 439/1లోని ఈ స్థలం వద్ద 164 సెక్షన్‌ను విధించి, ఇందులోకి ఎవరు ప్రవేశించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇరు వర్గాలకు నోటీసులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు మేరకు ఎస్‌ఐ షేక్ మహబూబ్ సుభానీ ఏఎస్‌ఐ, ఇద్దరు పోలీసు సిబ్బంది కాపాలా ఉంచారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం


మృతురాలి కుమారుడికి ఆర్థికసాయం అందిస్తున్న స్థానిక నేతలు

కావలి రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మరణించిన సిరిపురం టీడీపీ సభ్యురాలు షేక్ బేబమ్మ (65) మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నేతలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ సభ్యత్వం కలిగిఉన్న బేబమ్మ మృతి చెందిన విషయాన్ని స్థానిక సీనియర్ నాయకుడు నాయుడు రాంప్రసాద్ ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లాడు. ఈ సందర్భంగా మృతురాలి కుమారుడు ఖాజామొహిద్దీన్‌కు అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయుడు శ్రీను, ఉప్పాల జాలరావు, కొత్తపల్లి పెంచల ప్రసాద్, వల్లూరు దయాకర్ నాయుడు, రత్నంరాజు, పరుసు వెంకటేశ్వర్లు, తిరుపతి, మోర్ల వెంకట్రావ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలు

● పట్టించుకోని అటవీ, దేవదాయశాఖ అధికారులు


మాలకొండలోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న గదులు

వలేటివారిపాలెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డును ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. ఈ సమస్యను సంబంధిత అటవీ, దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నా అటు అటవీ, ఇటు దేవాదాయశాఖ అధికారులు మాకెందుకులే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన అధికారులే ఇలా చేస్తుండటంతో భక్తులు, స్థానికులు వాపోతున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు నరసింహస్వామి దర్శనానికి వస్తుంటారు. వీరికి ఆలయ పరిధిలో పూర్తిస్థాయిలో విశ్రాంతి గదులు లేవు. దీంతో భక్తులు అద్దెలు చెల్లించి ప్రయివేట్ గదులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

జాయింట్ సర్వే చేయాలని కోరాం : సురేష్, అటవీశాఖ అధికారి

మాలకొండలో నేషనల్‌హైవే రోడ్డును ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలపై అటవీశాఖ అధికారి సురేష్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరింది. తాము దేవాదాయశాఖ అధికారులను కలిసి జాయింట్ సర్వే చేసేందుకు రెవెన్యూ అధికారులను కోరినట్లు తెలిపారు.

మందుబాబులకు అడ్డాగా సచివాలయ భవనం


వెంకటరెడ్డిపల్లిలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనం

కలువాయి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరెడ్డిపల్లిలో అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయ భవనం మందుబాబులకు అడ్డాగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాల భవనాలు అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. దీంతో ఇక్కడ మందుబాబులు మద్యం సేవించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అసంపూర్తి భవనాలు పూర్తిచేసి ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

అభయం స్వచ్ఛంద సంస్థ సభ్యుల ఔదార్యం

● బిచ్చగాడి మృతదేహానికి దహన సంస్కారాలు

కావలి. జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భిక్షగాడు శంకరయ్య ఆదివారం మరణించాడు. విషయం తెలుసుకున్న అభయం స్వచ్ఛంద సంస్థ సేవకులు సంస్థ సేవకులు యిలింద్ర వెంకటేశ్వర్లు(ఈవీఎస్), బాష, శ్రీనులు అంతిమరథం డ్రైవర్ సునీల్‌తో కలిసి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. మొదట కావలి ఒకటో పట్టణ రైటర్ సుబ్బయ్య సంస్థ నిర్వహకులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని అంతిమరథంలో శ్మశానానికి తీసుకెళ్లి సొంత ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● జీ వేణుగోపాల్‌రావు, ఎంపీడీవో



వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించే సచివాలయ ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎంపీడీవో వేణుగోపాల్‌రావు ఆదివారం తెలిపారు.

? సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటిస్తున్నారా.

! ప్రతి ఉద్యోగి సమయ పాలన పాటిస్తూ సాయంత్రం వరకు ప్రజలకు అందుబాటులో ఉండాలి. అలా ఉండని వారిపై ప్రత్యేక నిఘా ఉంచి శాఖాపరమైన చర్యలు చేపడతాం.

ఈ వారం ముఖాముఖి

? లక్ష్య సాధనలో వెనుకబడిన వారిపై చర్యలు చేపడుతున్నారా.

! ప్రభుత్వం నిర్దేశించిన మేరకు లక్ష్య సాధనలో కొంత మంది వెనుకబడిన మాట వాస్తవమే. అలాంటి పంచాయతీ కార్యదర్శులకు ఇటీవల నెలవారీ వేతనాలను నిలిపివేశాం. అలాగే వెల్ఫేర్ అసిస్టెంట్లకు సైతం షోకాజ్ నోటీసులు అందజేశాం.

? పారిశుధ్యం మెరుగుకు ఏవిధంగా కృషి చేస్తున్నారు.

! పంచాయతీల వారీగా గ్రామాల్లో పరిశీలన చేపడుతున్నాం. సమస్యలను పరిష్కరించేలా కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛత దివస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం.

న్యూస్ బాక్స్

ప్రకృతిని పరిరక్షించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానులు

వింజమూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చిత్తూరు సీనియర్ పిరమిడ్ మాస్టర్ శ్రీనివాస అన్నారు. స్థానిక శ్రీవేదవ్యాస వశిష్ఠ పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం శాకాహారం ప్రాముఖ్యత వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. చెన్నకేశవస్వామి బజారు, పిరమిడ్ నగర్, ఎర్రబెల్లిపాలెం ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ధ్యానులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


పేదలకు దుప్పట్లు అందజేస్తున్న డబ్బుకొట్టు వసుంధర

కందుకూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిరుపేదలు, యాచకులకు ఆదివారం అయ్యప్పసేవా సంఘం సభ్యులు డబ్బుగొట్టు వసుంధర దుప్పట్లు, ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని ఆలయాలు, అనాథలైన నిరుపేదలు ఉండే ఇతర ప్రాంతాలకు వెళ్లి ఈ చర్యలు తీసుకున్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రపై విద్యార్థులకు అవగాహన


చిన్నారులతో గ్రంథపాలకుడు కోటేశ్వరరావు

ఉలవపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు సంక్రాంతి సెలవులు రావడంతో విద్యార్థులు స్థానిక గ్రంథాలయానికి ఉపయోగించుకుంటున్నారని గ్రంథ పాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులతో స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్ర, వార్తా పత్రికల్లోని ప్రధాన అంశాలు, తెలుగు పదాల ఉచ్చరణ అంశాలను తెలియజేశారు.

ట్రిబ్యునల్ సమావేశానికి ప్రొఫెసర్ కడియాలకు ఆహ్వానం

జలదంకి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రీన్ ఫీల్డ్ కేపిటల్ అమరావతి నిర్మాణానికి సంబంధించి జాతీయ హరిత ట్రిబ్యునల్ సమావేశం ఈ నెల 21న అమరావతిలో జరగనుంది. ఈ సమావేశానికి ట్రిబ్యునల్ ఇంప్లిమెంటేషన్ కమిటీలో సభ్యుడు ప్రొఫెసర్ కడియాల వెంకటేశ్వర్లుకు ఆహ్వానం అందింది. రాజధానిలో జరుగుతున్న నిర్మాణాలపై సీఆర్‌డీఏ ఇచ్చే నివేదికను పరిశీలించి హరిత ట్రిబ్యునల్ నిబంధనల మేరకు రాజధాని నిర్మాణం జరుగుతుందో లేదో అని పరిశీలించి పలు సూచనలు హరిత ట్రిబ్యునల్ కమిటీ ఇవ్వనుంది.